ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -52 పేజీలు - 8 వెల - 03/- గురువారం 11 జూన్ 2026



# దేశం కోసం ఏర్పడ్డదే ఎన్‌డిఏ

## ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షాల భేటీలో ప్రధాని మోడీ ప్రసంగం



- పుష్కర కాలంలో అనేక మార్పులు తీసుకుని వచ్చాం
- మాటలతో కాకుండా చేతలతో అభివృద్ధి చేసి చూపాం
- 12 ఏళ్లుగా కాంగ్రెస్ పాపాలను కడుక్కుంటూ వస్తున్నాం
- కాంగ్రెస్ పాలనలో వ్యవస్థల ధ్వంసం...వేలకోట్ల కుంభకోణాలు
- 2014కు ముందు..ఇప్పుడు దేశ పరిస్థితిని ప్రజలు గమనించాలి
- 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం
- 12 ఏళ్లు ప్రధానిగా పనిచేసే అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు



**న్యూఢిల్లీ, జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కాంగ్రెస్ హయాంలో దేశంలో అనేక సమస్యలు ఉండేవని.. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక మార్పులు తెచ్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందన్న ఆయన.. దేశాభివృద్ధికి స్థిరమైన ప్రభుత్వం ఉండాలని ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ప్రధానిగా 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఢిల్లీలో జరిగిన ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. ఎక్కువ కాలం ప్రధానిగా ఉండే అవకాశం ఇచ్చిన దేశప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. **మిగతా 2లో...**

# పశ్చిమాసియాలో కల్లోలం

-హర్మూజ్ వద్ద ఇరాన్ లక్ష్యాలపై అమెరికా దాడులు

-గల్ఫ్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై టెహ్రాన్ ప్రతిదాడి



**టెహ్రాన్/వాషింగ్టన్ : జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
దాడులు, ప్రతి దాడులతో పశ్చిమాసియా అట్టుడికిపోతోంది. కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ, ఆరోపణలు-ప్రత్యారోపణలు చేసుకుంటూ అమెరికా, ఇరాన్ పరస్పర దాడులకు దిగుతున్నాయి. హర్మూజ్ జలసంధి పరిసరాలలోని ఇరాన్ లక్ష్యాలపై అమెరికా జరిపిన దాడులకు ప్రతిగా జోర్డాన్, కువైట్, బహ్రేన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డులు బుధవారం **మిగతా 2లో...**

# అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్



- కేంద్ర కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండేలా నిర్మాణాలు
- రూ.2,500 కోట్లతో ఐదు ఎకరాల్లో నిర్మాణానికి అనుమతి
- 17 ఎకరాల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెసిడెన్షియల్ కాంప్లెక్స్
- కేంద్ర కేబినేట్ నిర్ణయం తీసుకుందున్న మంత్రి పెమ్మసాని

**న్యూఢిల్లీ, జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించిన వివరాల ప్రకారం, అమరావతిలో రూ.2,500 కోట్ల విలువైన సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు అమరావతి నిర్మాణానికి మరింత ఊతమివ్వనుంది**మిగతా 2లో...**

# మూగబోయిన పల్లె గొంతుక

- దిగ్గజ దర్శకుడు భారతీ రాజా ఇకలేరు...
- సినీ పరిశ్రమ దిగ్భ్రాంతి..పలువురి నివాళి



**చెన్నై : జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
'మిన్నేటి సూరీడు వచ్చేనమ్మా... పల్లె కోనేటి తామర్లు విచ్చేనమా..' అంటూ పల్లె మాటను మంత్రం చేసి, 'ఈ మమతే ..ఈ సమతే మంగళవాద్యం'అంటూ గ్రామీణ జీవన బంధాలను వెండితెరపై **మిగతా 2లో...**

# 13లోగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

- లేకుంటే దేశవ్యాప్త ఆందోళనలు
- కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) పిలుపు
- నేడు పూణేలో ఆందోళన ఆ తర్వాత లక్నో, అమృత్‌సర్, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్ లో..
- 20న జంతర్‌మంతర్ వద్ద నిరవధిక ధర్నా

**న్యూఢిల్లీ జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చిన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈనెల 13లోగా రాజీనామా చేయాలనీ, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పిలుపునిచ్చింది.**మిగతా 2లో...**






# అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

## నెహ్రూ రికార్డును తిరగరాసిని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
నరేంద్ర మోదీ భారత ప్రధానిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో 12 ఏళ్లు పూర్తయ్యాయి. అలాగే అత్యధిక కాలం ప్రధానిగా కొనసాగిన అరుదైన రికార్డును కూడా ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇప్పటివరకు ఈ రికార్డు నెహ్రూ పేరు మీద ఉంది. భారత రాజ్యాంగం అమల్లోకి **మిగతా 2లో...**



# ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం

## ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థను ప్రారంభించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే బండకేసి కొడతారని హెచ్చరించారు. బుధవారం భారత్ ఫ్యూచర్ సిటీలో.. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ భవనాన్ని ప్రారంభించారు. అలాగే లోగో, వెబ్‌సైట్‌ను సీఎం ఆవిష్కరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్ ఉండదని విమర్శించారు.**మిగతా 2లో...**

# భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం

- కార్మికులను తగ్గించడంతో పెరిగిన పనిభారం
- బాధిత కుటుంబాలకు జగన్ పరామర్శ
- ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపాటు



# ఉత్తర,దక్షిణ విభేదాలు దేశానికి ప్రమాదకరం

- జనసేన పుట్టిందే తెలంగాణ గడ్డమీద
- అక్కడి కి రావద్దంటే..మీ జాగీరా అనడంలో తప్పేముంది
- మీడియాతో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

**న్యూఢిల్లీ, జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు. కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం **మిగతా 2లో...**



# దేశం కోసం ఏర్పడ్డదే ఎన్‌డిఎ

**మొదటిపేజీ తరువాయి**

ఎన్డీయేలో ఉన్న అన్ని పార్టీలకు ఈ విజయం దక్కుతుందన్న ఆయన.. దేశ రాజకీయాల్లో నేడు చారిత్రకమైన రోజుగా అభివర్ణించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. రూ.వేల కోట్ల కుంభకోణాలు జరిగాయి. అభివృద్ధి రేటు దారుణంగా ఉండేది. మేం వచ్చాక రోడ్లు, రైల్వేలు, విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఇంటర్నెట్ వాడేవాళ్ల సంఖ్య 25 కోట్ల నుంచి వంద కోట్లకు పెంచాం. భారత్ 2014కు ముందు.. ఇప్పుడెలా ఉందో గమనించాలి. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన తర్వాత పెను మార్పులను ప్రజలు బేరీజు వేసుకోవాలి. కేవలం 12 ఏళ్లలోనే ఇన్ని మార్పులు తీసుకొచ్చాం. మా పథకాలు, కార్యక్రమాలను ప్రజలు కూడా ఆమోదించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గతంలో 370 ఆర్టికల్ అంటేనే భయపడేవారు.. మేం రద్దు చేశాం. గతంలో ఉగ్రవాదం పేరు చెబితే భయపడేవారు. మేం వచ్చాక దాడులు చేశాం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. 'వికసిత్ భారత్ 2047' దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. దేశంలో వస్తోన్న పెనుమార్పులను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. పలు దేశాలు సమస్యల పరిష్కారం కోసం మన వైపు చూస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపై నెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేల కోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఏ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఏలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఏ నేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీఏ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఏపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి.. ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు. తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోదీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని.. ఆచరణలో చేసి చూపించామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా.. భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు. సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఏ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తేలిపోయిందని అన్నారు. దేశంలో మావోలను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఆర్టికల్ నంబర్-370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే.. దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని.. ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా.. భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్

**. మొదటిపేజీ తరువాయి**

ప్రణాళిక ప్రకారం 5 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో అత్యాధునిక ఆఫీస్ కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారు. ఇందులో రెండు భారీ టవర్లను ఏర్పాటు చేసి వివిధ ప్రభుత్వ కార్యాలయాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకుని రానున్నారు. అలాగే 1,800 కార్లకు పార్కింగ్ సదుపాయాన్ని కల్పించేలా ఆధునిక మౌలిక వసతులతో ఈ కార్యాలయ సముదాయాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇదే ప్రాజెక్టులో భాగంగా రూ.1,234 కోట్ల వ్యయంతో 17 ఎకరాల విస్తీర్ణంలో రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ను కూడా నిర్మించనున్నారు. 11 టవర్లలో మొత్తం 1,568 నివాస క్వార్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు పెమ్మసాని వెల్లడించారు. గ్రీన్ ఎనర్జీ వినియోగం, కమ్యూనిటీ హాల్స్, ఆధునిక సదుపాయాలతో కూడిన గేటెడ్ కమ్యూనిటీగా ఈ నివాస సముదాయాన్ని అభివృద్ధి చేయనున్నారు. 2018లో తొలిసారిగా ప్రతిపాదించబడిన ఈ ప్రాజెక్టు పలు కారణాలతో ముందుకు సాగకపోయినా, 2024 తర్వాత వేగం పుంజుకుని ప్రస్తుతం ఆమోద దశకు చేరుకుంది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, కేంద్ర ఆర్థిక శాఖల సమన్వయంతో ఈ ప్రాజెక్టుకు అనుమతులు లభించినట్లు సమాచారం. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారం వల్లే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు సాధ్యమైందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అమరావతిలో పరిపాలనా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు రాజధాని అభివృద్ధికి కొత్త ఊపు లభించనుందని ఆయన అభిప్రాయపడ్డారు. బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి సమావేశమైంది. ఈ సమావేశంలో రాజధాని అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్ట్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. అమరావతిలో రూ.2,500 కోట్ల విలువైన సెంట్రల్ సెక్రటేరియట్ ప్రాజెక్టుకు ఆమోద ముద్ర పడిందని వివరించారు.

# భద్రతా లోపాల వల్లే స్టీల్ ప్లాంట్ ప్రమాదం

### కార్మికులను తగ్గించడంతో పెరిగిన పనిభారం

### బాధిత కుటుంబాలకు జగన్ పరామర్శ

### ప్రభుత్వం నిర్లక్ష్యంపై మండిపాటు



**విశాఖపట్టణం, జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** స్టీల్ ఫ్యాక్టరీలో ఇటీవల జరిగిన ప్రమాదానికి రా మెటీరియల్ లోపాలు, భద్రతా ప్రమాణాలు పాటించక పోవడమే కారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. బుధవారం విశాఖను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. లిక్విడ్ స్టీల్ బ్లాస్ట్ కావడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. 14 నెలల క్రితం స్టీల్ ఎ÷-లాంట్‌లో ప్రాణాలు కోల్పోయిన మాస్టర్ టెక్నీషియన్ పెంటయ్య కుటుంబానికి ఇప్పటికీ పరిహారం అందలేదని జగన్ ఆరోపించారు. పరిహారం గురించి అడిగితే ఫైలు పోయిందని సమాధానం ఇచ్చారని విమర్శించారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో జగన్‌మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నించిన ఆయన, బాధిత కుటుంబాలకు తక్షణమే కోటి రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని జగన్ గుర్తుచేశారు. ప్లాంట్ పరిరక్షణ కోసం కేంద్రానికి రెండు లేఖలు కూడా రాశామని అన్నారు. ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు, కార్మికుల పక్షాన నిలిచింది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. విశాఖలో జరిగిన బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా ఈ అంశంపై గట్టిగా కోరినట్లు వెల్లడించారు. స్టీల్ ప్లాంట్‌లో గత రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్య భారీగా తగ్గిపోయిందని జగన్ ఆరోపించారు. ఒకప్పుడు 28 వేల మంది ఉద్యోగులు ఉండగా, ప్రస్తుతం సుమారు 10,500 మందిని తొలగించారని చెప్పారు. ప్రస్తుతం కాంట్రాక్ట్, రెగ్యులర్ కార్మికులు మాత్రమే మిగిలి ఉన్నారని పేర్కొన్నారు. స్టీల్ ఎ÷-లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చామని కూటమి ప్రభుత్వ నేతలు చెబుతున్నారని, అయితే ఆ నిధులను స్వచ్ఛంద పదవీ విరమణ (÷ఎఖా), బ్యాంకు రుణాల చెల్లింపులకే వినియోగించారని విమర్శించారు. ప్లాంట్ నిర్వహణ, భద్రతా చర్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఎల్జీ పాలిమర్స్ ప్రమాద బాధితులకు తమ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం ఇచ్చిందని గుర్తు చేసిన జగన్, అదే తరహాలో స్టీల్ ఎ÷-లాంట్ ప్రమాద బాధిత కుటుంబాలకు కూడా ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అలాగే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం కూడా అసెంబ్లీలో తీర్మానం చేయాలని జగన్ కోరారు. ప్రస్తుతం బాధిత కుటుంబాలు కొంత ఓపిక పట్టాలని, ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే కోటి రూపాయల పరిహారం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం జగన్ గాజువాకలోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి బయలుదేరారు.

# ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం

**మొదటిపేజీ తరువాయి**

ఔటర్ రింగ్ రోడ్‌ను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు. మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. కడుపునిండా విషం నింపుకొని కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న 2 గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బతుకమ్మ కుంట ఏమైనా ఎడ్ల సుధాకర్ తాత ఆస్తినా అని ప్రశ్నించారు. అంబర్‌పేటలో ఉన్న బతుకమ్మకుంటను ఎడ్ల సుధాకర్‌కు కేసీఆర్ రాసిచ్చారు. ఆనాటి నాయకులు ప్రభుత్వ భూముల్ని ఆక్రమించారు. అందుకే, హైడ్రాతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నాం. చెరువులను పునరుద్ధరిస్తున్నాం. లేక్ ఎకానమీ సృష్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. గ్లోబల్ సమ్మిట్ ద్వారా ప్రపంచదేశాలను ఇక్కడికి రప్పించాం. డిసెంబర్‌లోనూ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదు.. తమ ప్రయత్నం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరుల కోరలు పీకుతాం.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. తెలంగాణకు 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని వ్యాఖ్యానించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. టోక్యో, సింగపూర్‌తో ఫ్యూచర్ సిటీ పోటీ పడుతుందని చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీ అని ఉద్ఘాటించారు. ప్రపంచ దేశాలను ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం మన కోసం మాత్రమే కాదు.. మొత్తం ప్రపంచానికని అన్నారు. 150 రోజుల్లోనే ఈ కార్యాలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. వచ్చే ఎనిమిదేళ్లలో న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌తో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని రూపొందిస్తామని చెప్పారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకి ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరాన్ని విస్తరించడం వల్లే ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభించింది. బంగారం ధర కంటే రంగారెడ్డి భూముల ధరలే ఎక్కువ. ఆనాటి నిజాంలు, కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని అనేకసార్లు విస్తరించారు. హైటెక్‌సిటీ, ఓఆర్ఆర్, జీనోమ్ వ్యాలీని అడ్డుకోవాలని చాలా మంది కుట్రలు చేశారు. నగరాన్ని విస్తరించకపోతే 10లక్షల మంది ఐటీ నిపుణులు రాణించేవారా అని అన్నారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్రలు పన్నుతున్నారు. బీఆర్ఎస్ రద్దయిన నోటు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారు. ఇలాగే ప్రవర్తిస్తే వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని హెచ్చరించారు.

# పశ్చిమాసియాలో కల్లోలం

**మొదటిపేజీ తరువాయి**

క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించారు. ఏప్రిల్‌లో ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున ఘర్షణలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి. హర్మూజ్ సమీపంలో అమెరికా అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ మంగళవారం కూల్చివేసిన నేపథ్యంలో ప్రతీకార దాడులు జరపాలని అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సేనలను ఆదేశించారు. దీంతో అమెరికా సేనలు హర్మూజ్ పరిసరాలలోని ఇరాన్ లక్ష్యాలపై దాడులు జరిపాయి. అలాగే ఇరాన్ చర్చల విషయంలో ఆలస్యం చేసిందని, అందుకు భారీ మూల్యం చెల్లించుకుంటుందని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ చేశారు. అయితే యుద్ధ పరిస్థితుల్లో సంయమనం పాటించాలని రష్యా ఇరు దేశాలను కోరింది. అలాగే పశ్చిమ ఆసియాలోని సంఘర్షణపై తాము "తీవ్ర ఆందోళన" వ్యక్తం చేస్తున్నామని, ఉద్రిక్తతలను పెంచవద్దని చైనా ఇరు పక్షాలకు విజ్ఞప్తి చేసింది. అమెరికా ప్రతీకారం బలంగా, శక్తివంతంగా ఉంటుందని దాడులకు ముందు ట్రంప్ మీడియాకు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలు, గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్లు, నిఘా రాడార్ ప్రదేశాలపై తాజాగా దాడులు చేశామని అమెరికా సైన్యం ప్రకటించింది. ఈ దాడులు నాలుగు గంటల పాటు కొనసాగాయి. దాదాపు 20 ఇరాన్ లక్ష్యాలపై దాడులు జరిగాయని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. హర్మూజ్ పరిసరాలలోని మూడు వ్యూహాత్మక ప్రదేశాలలో పేలుడు శబ్దాలు వినిపించాయి. రెండు నీటి రిజర్వాయర్లపై కూడా అమెరికా దాడి చేసిందని, దీంతో ఆ ప్రాంతంలో ఇరవై వేల మందికి నీటి సరఫరా నిలిచిపోయిందని ఇరాన్ ప్రభుత్వ ప్రసార సంస్థ తెలిపింది. ఈ రిజర్వాయర్ల నుంచి కౌహెస్టాక్ పట్టణానికి, దాని పరిసరాలలోని పది గ్రామాలకు తాగు నీరు సరఫరా అవుతోంది. అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ అధికారులు అత్యవసర చర్యలు చేపట్టి ప్రత్యామ్నాయ మార్గాలలో నీటి సరఫరా చేస్తున్నారు. కాగా ఖెష్మ్ దీవి పైన, హర్మూజ్‌లోని ఓడరేవు నగరమైన సిరిక్ పైన అమెరికా దాడులు చేసిందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) తెలియజేసింది. అమెరికా జరిపిన దాడులకు ప్రతీకారంగా బహ్రేన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించామని చెప్పింది. ఎఫ్-35 ఫైటర్ జెట్ హ్యాంగర్లు సహా దూర శ్రేణి క్షిపణులతో జోర్డాన్‌లో అమెరికాకు చెందిన అల్-అజ్రఖ్ స్థావరంలోని నాలుగు ప్రదేశాలు, కమాండ్ కంట్రోల్ కేంద్రంపై రివల్యూషనరీ గార్డులు దాడులు చేశారు. అమెరికా మరోసారి దాడులకు దిగితే తమ స్పందన నిర్ణయాత్మకంగా ఉంటుందని హెచ్చరించారు.

# మూగబోయిన పల్లె గొంతుక

**మొదటిపేజీ తరువాయి**

ఆవిష్కరించిన భారతీయ సినిమా దిగ్గజ దర్శకుడు భారతీ రాజా (84)ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన బుధవారం తెల్లవారుజామున చెన్నైలో తుది శ్వాస విడిచారు. 'అలలు కలలు ఎగిసి ఎగిసి అలసి సొలసి పోయే...'అంటూ ఆయనే చిత్రీకరించినట్లు గ్లామర్ ప్రపంచానికి, ఇండోర్ సెట్లకు పరిమితమైన సినిమాను పల్లెటూరి మట్టిలోకి, సహజమైన వెలుగులోకి తీసుకురావడానికి నిర్విరామంగా కృషి చేసిన ఆయన ఇక శాశ్వత విశ్రాంతిలోకి జారుకున్నారు. తాను స్వయంగా హేతువాది అయిన ఆయన తన సినిమాల్లోనూ అభ్యుదయ భావజాలానికి పెద్దపీట వేశారు. కులాంతర ప్రేమలకు మద్దతివ్వడం, గ్రామీణ మూఢనమ్మకాలపై ఎలుగెత్తడం, మానవత్వానికి ప్రాధాన్యం ఇవ్వడం, మతాచారాల కంటే సామాజిక న్యాయానికి పట్టం కట్టడం, మహిళలు సాంప్రదాయ బంధనాల్లో కాకుండా స్వతంత్ర వ్యక్తులుగా కనిపించడం వంటి దృశ్యాలు ఆయన సినిమాల్లో సర్వసాధారణం. భారతీ రాజా మరణ వార్తతో సినీ పరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. యావత్ భారత సినీ పరిశ్రమకు ఆయన భౌతికంగా లేకపోవటం తీరనిలోటని పలువురు సంతాపం తెలిపారు. కేవలం కథల్లోనే కాకుండా, మేకింగ్‌లో కూడా హేతుబద్ధతను పాటించారు. అప్పటివరకు తన సినిమాల ద్వారా "ఆరాధన అనేది కేవలం అభిమానంగానే ఉండాలి కానీ, అది మూఢభక్తిగా మారకూడదు" అని నమ్మి, తన ఫ్యాన్ అసోసియేషన్లను కూడా రద్దు చేయమనడం ఆయన హేతుబద్ధ ఆలోచనకు నిదర్శనమని సినీ రంగ ప్రముఖులు గుర్తు చేసుకున్నారు.

# అత్యధిక కాలం ప్రధానిగా మోడీ రికార్డు

**మొదటిపేజీ తరువాయి**

వచ్చాక జరిగిన తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచాక 1952 మే 13న ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 1964 మే 27న మరణించేదాకా 4,398 రోజులపాటు నిరంతరాయంగా ఆ పదవిలో కొనసాగారు. కాంగ్రెసేతర పార్టీ తరఫున రెండు సార్లు పూర్తికాలపు ప్రధానిగా పదేళ్లు పనిచేసి రికార్డు సాధించిన మోదీ.. ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును అధిగమించనున్నారు. ఈ రకంగా ప్రధానిగా వరుసగా అత్యధిక కాలం దేశాన్ని పాలించిన రికార్డును నేటితో మోదీ తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించి ఈ ఘనతను సొంతం చేసుకున్నారు. మోదీ 2014 మే 26న తొలిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పదవిలో వరుసగా మూడోసారి కొనసాగుతున్నారు. బుధవారం తో ఆయన ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. ఎన్నికైన ప్రధానమంత్రిగా నెహ్రూ 1952 మే 13 నుంచి 1964 మే 27 వరకు వరుసగా 4,398 రోజులు పని చేశారు. ఎన్నికైన తర్వాత వరుసగా అత్యధిక కాలం భారత ప్రధానిగా కొనసాగిన వారి జాబితాలో ఇందిరాగాంధీ మూడో స్థానంలో ఉన్నారు. ఆమె 1966 జనవరి 24 నుంచి 1977 మార్చి 24 వరకు వరుసగా 4,077 రోజులు పదవిలో ఉన్నారు.

# 13లోగా కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకూ నిరసనలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు దేశ యువత భయపడటం లేదని తెలిపింది. నేడు పూణేలో ఆందోళన చేపట్టనుంది. ఆ తరువాత లక్నో, అమృత్‌సర్, బెంగళూరు, జైపూర్, హైదరాబాద్‌ల్లో కూడా ఆందోళనలు చేపట్టనున్నట్టు ప్రకటించింది. అదే విధంగా ఈనెల 20న జంతర్ మంతర్ వద్ద నిరవధిక ధర్నా చేపడతామని హెచ్చరించింది. "పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకల కారణంగా లక్షలాది కుటుంబాలు, యువత భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఇది ఒక జాతీయ సమస్య.పదేపదే జరుగుతున్న ఈ వైఫల్యాలకు విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించడంలో విఫలం అయ్యారు. జవాబుదారీతనం ఉన్నత స్థాయి నుంచే ప్రారంభం కావాలి. అందుకే మేము ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పునరుద్ఘాటిస్తున్నాం" అని సీజేపీ పేర్కొంది.దేశ విద్యా వ్యవస్థ సమగ్రతను కాపాడటానికి, సంస్థాగత వైఫల్యానికి ఏ విద్యార్థి కూడా మూల్యం చెల్లించకుండా చూసేందుకు ఈ ఉద్యమం చేపట్టినట్టు తెలిపింది. జవాబుదారీతనం, న్యాయం కోసం జరిగే పోరాటంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాలు పంచుకోవాలని సీజేపీ పిలుపునిచ్చింది. పూణేలో జరిగే నిరసనలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ పాల్గొంటారని తెలిపింది.విద్యార్థులను ప్రభావితం చేసే సమస్యలపై దేశ యువత ఇకపై మౌనంగా ఉండేందుకు సిద్ధంగా లేదని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త నిరసన చేపడతామని హెచ్చరించారు. . ప్రభుత్వం నైతిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ వంటి పరీక్షలకు సంబంధించిన సమస్యల కారణంగా కోటి మందికి పైగా విద్యార్థులు నష్టపోయారని, ఈ పరిస్థితికి బాధ్యత తీసుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరని అన్నారు. వ్యవస్థ వైఫల్యం కారణంగా, డాక్టర్లుగా ఎదిగి ప్రాణాలను కాపాడగలిగే విద్యార్థులు తమ ప్రాణాలను కోల్పోతున్నారని విమర్శించారు.

# ఉత్తర,దక్షిణ విభేదాలు దేశానికి ప్రమాదకరం

**మొదటిపేజీ తరువాయి**

తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. ఇకపోతే ఉత్తరాది, దక్షిణాది అనే భావన సరికాదని, అలా విభజన రేఖ గీయకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ భావన పెరిగితే దేశానికి ప్రమాదకరమని చెప్పారు. సమస్యలుంటే ఎక్కడైనా వాటిపై మాట్లాడొచ్చన్నారు. సీఎం హోదాలో ఉన్నవారు ఉత్తర, దక్షిణ ప్రాంతాలంటూ మాట్లాడకూడదని హితవు పలికారు. విభజనవాదం దేశానికి మంచిది కాదు. 570కి పైగా సంస్థానాలను కష్టపడి విలీనం చేస్తే దేశం ఇలా ఉంది. నేను హైదరాబాద్ రాకూడదని కొందరు నేతలు అన్నారు. అలా అయితే, రాహుల్ గాంధీకి దక్షిణాదితో సంబంధం లేదని చెప్పాల్సి ఉంటుంది. రాజకీయాలు మారాలని, ప్రాంతీయ వివక్ష, విధ్వంసకర ధోరణి ఉండకూడదని యువత కోరుకుంటోంది. చెప్పే మాటల్లో అర్థం, హేతుబద్ధత ఉండే నాయకులే యువతకు కావాలి. తమ సమస్యలు తెలుసుకొని, పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కావాలని కోరుకుంటున్నా. అక్కడ పోటీ చేయాలని మా పార్టీ నేతలు కోరారు. నేనెప్పుడు, ఎక్కడికి వెళ్లాలో ఇతర వ్యక్తులు చెప్పలేరు. ఈ దేశం నాది.. ఎక్కడికైనా వెళ్లవచ్చనే ఉద్దేశంతోనే జాగీర్ అనే పదం వాడా. రాష్ట్ర విభజనకు నేనెప్పుడూ వ్యతిరేకం కాదు.. చేసిన తీరునే వ్యతిరేకించా'అని పవన్ తెలిపారు.వీబీ-జీ రామ్ జీ పథకం కింద ఏపీకి కేంద్రం రూ.7,707.21 కోట్లు కేటాయించడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. దేశంలోనే మూడో అత్యధిక కేటాయింపును ఏపీ దక్కించుకుందన్నారు. ఉపాధి పనుల్లో పారదర్శకతతో పాటు సమర్థవంతమైన నిర్వహణకు ఇది నిదర్శనంగా అభివర్ణించారు. కేంద్రం ఇస్తున్న నిధులు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తాయని, ప్రజల జీవనోపాధిని మెరుగుపరుస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# కర్నూలులో బెదిరించి నగదు వసూలు చేసిన ముఠా అరెస్ట్

**వ్యక్తిని చంపేస్తామని బెదిరించి రూ.5 వేల దోపిడీ..**

**నలుగురు నిందితుల పట్టివేత నగదు, కారు స్వాధీనం**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 10)**కర్నూలు నగరంలో ఓ వ్యక్తిని బెదిరించి నగదు దోచుకున్న ఘటనను త్రీటౌన్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నగదు, కారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బి-క్యాంప్ డాక్టర్స్ కాలనీలోని వి.సి. ప్లాజా అపార్ట్‌మెంట్స్‌కు చెందిన చాకలి శేఖర్ ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం మాధవనగర్‌లోని శ్రీ శిల్పా క్యాటరింగ్ సమీపంలో తన ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా, నిందితులు టాటా ఇండికా విస్టా కారులో అక్కడికి చేరుకున్నారు.నిందితులు శేఖర్‌ను అడ్డగించి, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నావంటూ ఆరోపిస్తూ తన వద్ద ఉన్న డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే అక్కడికక్కడే చంపేస్తామని బెదిరిస్తూ గొంతు పట్టుకుని భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో ప్రాణభయంతో శేఖర్ తన వద్ద ఉన్న రూ.5 వేల నగదును వారికి అప్పగించాడు. అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులకు అందిన సమాచారం ఆధారంగా జోహరాపురం గ్రామ పరిధిలోని సి.పి.ఎం. కొట్టాల ప్రాంతంలో నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.త్రీ టౌన్ సీఐ శేషయ్య ఆదేశాలతో సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.3 వేల నగదు మరియు ఘటనలో ఉపయోగించిన టాటా ఇండికా విస్టా కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు వెల్లడించారు.దారిదోపిడీ కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు బృందాన్ని అధికారులు అభినందించారు.

# ఏపీ మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజ్, పాణ్యం ఆన్లైన్ దరఖాస్తులుచేసుకోండి,

**ప్రిన్సిపాల్ దినేష్ కుమార్.**

**పాణ్యం ప్రతినిధి, జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)** పాణ్యం స్థానిక 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏపీ మోడల్ స్కూల్ & జూనియర్ కాలేజ్, పాణ్యంలో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి 7వ తరగతి నుండి 9వ తరగతి వరకు మరియు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.అభ్యర్థులు 10-06-2026 నుండి 20-06-2026 వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు సమర్పించుటకు అధికారిక వెబ్‌సైట్:https://apms.apcfss.in/ప్రవేశ పరీక్ష 24-06-2026 తేదీన నిర్వహించబడుతుంది.విద్యార్థుల ఎంపిక ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా మరియు స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పిస్తూ చేపట్టబడుతుంది.ప్రవేశాలకు ఆఫ్‌లైన్ దరఖాస్తులు స్వీకరించబడవు. అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

# కర్నూలు అభివృద్ధే లక్ష్యం..

**మంత్రులు, ప్రజాప్రతినిధుల కీలక సమీక్ష సమావేశం**

**జిల్లా అభివృద్ధి పనులు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ**

**విజయవాడలో సమావేశమైన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇంచార్జిలు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 10)**కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా జిల్లా ఇంచార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ గుప్తా ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. విజయవాడలోని జలమండలి కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారం, వివిధ రంగాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు.
సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ ఎమ్మెల్యే కె.ఈ. శ్యాంబాబు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, ఆదోని ఇంచార్జి మీనాక్షి నాయుడు, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు ఇంచార్జి వైకుంఠం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, మౌలిక సదుపాయాల విస్తరణ, సంక్షేమ పథకాల అమలు, ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కర్నూలు జిల్లాను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.ౚ

# ఎ -వన్ డిజిటల్స్ షోరూం ప్రారంభోత్సవం

**అనంతపురం/ ఉరవకొండ జూన్ 10( రిపబ్లిక్ న్యూస్)**



రాయదుర్గం పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు ఎ -వన్ భాష ఆత్మీయ ఆహ్వానం మేరకు ఉరవకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన ఎ -వన్ డిజిటల్స్ షోరూం 8వ బ్రాంచ్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంతకల్ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ, జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి నాగేంద్ర హాజరై ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉరవకొండ పట్టణ ప్రజలకు అత్యాధునిక సదుపాయాలతో కూడిన డిజిటల్ షోరూం అందుబాటులోకి రావడం సంతోషకర విషయమని పేర్కొన్నారు. వ్యాపారంలో కస్టమర్లను దేవుళ్లుగా భావించి నాణ్యమైన సేవలు అందిస్తే ప్రజల ఆదరణతో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు.అలాగే షోరూం ప్రొప్రైటర్ ఎ -వన్ భాష ప్రత్యేకంగా అభినందిస్తూ, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారవేత్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# పందుల దొంగల ముఠాపై పోలీసుల ఉక్కుపాదం..

**ఇద్దరు అరెస్ట్**

**రూ.3 లక్షల విలువైన 30 పందులు,**

**బొలెరో పికప్ వాహనం స్వాధీనం**

**మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 10)**
కర్నూలు నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో జరిగిన పందుల దొంగతనం, యజమానులపై దాడి ఘటనలో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, రూ.3 లక్షల విలువైన 30 పందులతో పాటు బొలెరో సిటీ పికప్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.గత మే 28న వీకర్ సెక్షన్ కాలనీలోని పందుల ఫారంను లక్ష్యంగా చేసుకున్న దుండగులు 30 పందులను అపహరించడమే కాకుండా, అడ్డుకున్న యజమానులపై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు రాబరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సీఐ విక్రమసింహ, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితుల కదలికలను గుర్తించి ట్రాక్ చేసింది. విచారణలో బెంగళూరుకు చెందిన పరశు రాం, శ్రీను, భాగల్‌కోట్ జిల్లాకు చెందిన లక్ష్మణ్, ఎల్లప్ప, సింధనూరుకు చెందిన మారుతి ఈ నేరానికి పాల్పడినట్లు తేలింది.ఈ క్రమంలో పరశురాం మరియు ఒక మైనర్ బాలుడిని మునగాలపాడు శివారులో అరెస్ట్ చేశారు. నిందితులు దొంగతనాలకు పాల్పడే సమయంలో గుర్తింపు తప్పించుకునేందుకు వాహనాలకు వేర్వేరు నంబర్ ప్లేట్లు ఉపయోగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.అరెస్టు చేసిన నిందితుల వద్ద నుంచి కేఏ-15-ఏ-7773 నంబర్ గల బొలెరో సిటీ పికప్ వాహనం, 30 పందులు, అలాగే దాడులకు ఉపయోగించే కూల్‌డ్రింక్ సీసాలు, రాళ్లతో కూడిన క్రేట్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టు చేసిన పరశురాం మరియు మైనర్ బాలుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు వారిని రిమాండ్‌కు తరలించింది.ఈ కేసులో ఇంకా ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. వీరు ధోన్, ప్యాపిలి, శాంతినగర్ ప్రాంతాల్లో గత నెలలో జరిగిన పందుల దొంగతనాల్లో కూడా పాల్గొన్నట్లు అనుమానిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

# ప్రజల సంతృప్తే పరిపాలన విజయానికి గీటురాయి

**: కమిషనర్ చల్లా ఓబులేసు**

**ఇంటింటి చెత్త సేకరణ 100 శాతం పూర్తి చేయాలి**

**డ్రైనేజీలు, రహదారులపై ఆక్రమణలు తొలగించాలని సూచన**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూన్ 10)**
కర్నూలు నగరంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే నగరపాలక సంస్థ లక్ష్యమని, ప్రజల సంతృప్తే ఉద్యోగుల పనితీరుకు నిజమైన కొలమానమని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. పాతబస్తీలోని 3వ శానిటేషన్ డివిజన్ మస్టర్‌ను తనిఖీ చేసిన ఆయన, అనంతరం బొంగుల బజార్, గౌలిగేరి, మండిబజార్, ఖడక్‌పూర్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా పరిస్థితులను పరిశీలించారు.పర్యటన సందర్భంగా ప్రజల సమస్యలు, ఫిర్యాదులను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఇంటింటి చెత్త సేకరణ, పూడికతీత వంటి పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఆటంకం కలిగించే విధంగా డ్రైనేజీ కాలువలు, రహదారులపై ఆక్రమణలు చేయడం సరికాదని హెచ్చరించారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు.
పారిశుద్ధ్య పర్యవేక్షకులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఉద్యోగులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా ప్రజలతో మర్యాదపూర్వకంగా, ఆప్యాయంగా వ్యవహరించాలని సూచించారు. సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని పరిష్కార మార్గాలు అన్వేషించాలని తెలిపారు.ప్రజల సమస్యల పరిష్కారం, పారదర్శకత, సేవల నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కమిషనర్, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలను సానుకూలంగా స్వీకరించి సేవలను మరింత మెరుగుపరచాలని అన్నారు. ప్రజల విశ్వాసం, సంతృప్తే పరిపాలన విజయానికి అసలైన గీటురాయని పేర్కొన్నారు. అనంతరం కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించిన కమిషనర్, అక్కడ అల్పాహారం చేస్తున్న ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యతపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ముర్తుజావలి తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణకు రైతుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

**నూనెపల్లె మార్కెట్ యార్డు భూమిని తెలుగుదేశం పార్టీకి కేటాయించిన ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.**

**--రాయలసీమ సాగునీటి సాధన సమితి**



**నంద్యాల జూన్ 10 (రిపబ్లిక్ న్యూస్) :**
నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల భూమిని తెలుగుదేశం పార్టీకి దారాదత్తం చేస్తూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా భారతీయ కిసాన్ సంఘ్ బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది.
భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు సహదేవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, సంఘ్ నాయకులు సిద్దారెడ్డి, మహేశ్వరరెడ్డి, నందిరైతు సమాఖ్య నాయకులు కృష్ణారెడ్డి మరియు రైతు ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు మాట్లాడుతూ..
గత ప్రభుత్వ తిరోగమన నిర్ణయాల ఫలితంగా నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ పరిశోధన స్థానం పరిధిలోని 50 ఎకరాల భూమిని ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించడం, అదేవిధంగా అక్కడే తాత్కాలిక కలెక్టరేట్‌ను ఏర్పాటు చేయడం వల్ల రాయలసీమ రైతాంగానికే కాకుండా దేశవ్యాప్తంగా రైతులకు అవసరమైన పంటల విత్తనాల అభివృద్ధి, పరిశోధన కార్యక్రమాలకు కేంద్రబిందువుగా ఉన్న ఈ సంస్థ నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.
సుమారు 125 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ప్రతిష్ఠాత్మక పరిశోధన సంస్థను బలహీనపరుస్తున్న చర్యలను అప్పట్లో తెలుగుదేశం పార్టీతో సహా దాదాపు అన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి.. నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానాన్ని పరిరక్షించాలని బహిరంగంగా డిమాండ్ చేశాయని గుర్తు చేసారు.
అయితే, 50 ఎకరాల భూమి ఇప్పటికే వైద్య కళాశాలకు కేటాయించబడిన నేపథ్యంలో, ప్రస్తుతం ఈ పరిశోధన సంస్థను కాపాడుకునేందుకు మిగిలిన అత్యంత కీలకమైన అవకాశం అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్‌ను తక్షణమే ప్రత్యామ్నాయ స్థలానికి తరలించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ అంశాన్ని తెలుగుదేశం పార్టీ నాయకత్వం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లగా, కలెక్టరేట్‌ను మార్కెట్ యార్డుకు గానీ లేదా ఇతర అనువైన ప్రదేశానికి గానీ తరలించి పరిశోధన స్థానాన్ని పరిరక్షిస్తామని వారు హామీ ఇచ్చారని తెలిపారు.
కానీ, నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణ అనే అత్యవసర అంశాన్ని పక్కనపెట్టి, కూటమి ప్రభుత్వం నూనెపల్లె మార్కెట్ యార్డులోని రెండు ఎకరాల భూమిని 33 సంవత్సరాల కాలానికి సంవత్సరానికి కేవలం ?1,000 లీజు చొప్పున తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం కేటాయించడం అత్యంత విచారకరం. రైతుల భవిష్యత్తు, వ్యవసాయ పరిశోధనల పరిరక్షణ కంటే పార్టీ కార్యాలయ నిర్మాణానికే ప్రాధాన్యత ఇవ్వడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన చర్యగా మేము భావిస్తున్నామన్నారు.
ఈ నిర్ణయాన్ని రాయలసీమ సాగునీటి సాధన సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. నంద్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పరిరక్షణ, రైతుల ప్రయోజనాల సాధన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం భారతీయ కిసాన్ సంఘం చేపట్టిన ఉద్యమానికి మా సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తూ ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు.
అందువల్ల, రైతు హక్కులు, వ్యవసాయ పరిశోధనల పరిరక్షణ మరియు ప్రజా ప్రయోజనాల కోసం మార్కెట్ యార్డు స్థలాన్ని, అలాగే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థలాన్ని పరిరక్షించాలని ఈ సందర్భంగా నంద్యాల జిల్లా సంయుక్త కలెక్టర్ గారికి భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు సహదేవరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. రైతు సంఘాలు ఇచ్చిన వినతిపత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెల్తామని హామీ ఇచ్చారు.

# కాల్‌మనీ దందా బారిన పడ్డ యువకుడు

## అక్రమ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ నేతలు



**శ్రీ సత్య సాయి క్రైమ్, జూన్ 10,(రిపబ్లిక్ న్యూస్):** అవసరానికి డబ్బులు తీసుకుని తిరిగి ఇచ్చేటప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో పడుతున్నారు. అలాంటిది ఇప్పుడుకాల్ మనీ దందా బారిన ఓ యువకుడు పడ్డాడు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో కాల్‌మనీ వ్యాపారుల వేధింపులు, దాడులకు గురైన బుర్రా హరికృష్ణ కుటుంబాన్ని బుధవారం బీజేపీ నాయకులు పరామర్శించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న హరికృష్ణను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. కాల్‌మనీ పేరుతో అధిక వడ్డీలు వసూలు చేస్తూ సామాన్య ప్రజలను వేధించడం, బెదిరించడం, దాడులకు పాల్పడుతున్నారని హరీష్ బాబు పేర్కొన్నారు. బాధితుడిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ప్రజల ఆర్థిక ఇబ్బందులను ఆసరాగా చేసుకుని అక్రమ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితున్ని పరామర్శించిన వారిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబిలేసు, ప్రకాష్ గౌడ్, డి. చెర్లోపల్లి నారాయణస్వామి, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# శ్రీధర్‌రెడ్డి వ్యవహారం సంస్కారహీనం

## మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



**శ్రీ సత్యసాయి ప్రతినిధి, జూన్ 10,(రిపబ్లిక్ న్యూస్):** మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి రాజకీయ సమతుల్యత కోల్పోయి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. పుట్టపర్తి టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రాజకీయాల్లో సంస్కారం, హుందాతనం ఎంతో ముఖ్యమని, వాటిని విస్మరించి వ్యక్తిగత విమర్శలకు దిగడం సరైంది కాదన్నారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గానికి ఏ మేర అభివృద్ధి చేశారో ప్రజలకు వివరించాలని శ్రీధర్‌రెడ్డిని ప్రశ్నించారు. 193 చెరువులకు నీరు అందిస్తానన్న హామీ ఏమైందని నిలదీశారు.జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడానికి ఖండిస్తున్నామన్నారు.కోట్లాది మంది అభిమానులు ఉన్న నాయకులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం రాజకీయ పరిణతి కాదన్నారు. ఉనికి చాటుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.ప్రజల గుండెల్లో నిలిచే అభివృద్ధే తమ లక్ష్యమని, టీడీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో రూ.4వేలు పింఛన్ అమలు చేయడంతో పాటు పలు సంక్షేమ పథకాలను దశలవారీగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఓటమి తర్వాత కూడా ప్రజా తీర్పును గౌరవించకుండా విమర్శలు చేయడం మానుకోవాలని శ్రీధర్‌రెడ్డికి సూచించారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ధ్యేయమని పల్లె రఘునాథరెడ్డి స్పష్టం చేశారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు.

# అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలి

## మండల కన్వీనర్ కొండా పురుషోత్తం





**చిప్పగిరి, జూన్, 10,( రిపబ్లిక్ న్యూస్)** చిప్పగిరి నందు బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఎస్ఐఆర్ టిడిపి మండల స్థాయి సమావేశం కన్వీనర్ కొండ పురుషోత్తం, క్లస్టర్ ప్రభాకర్, సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, ఆధ్వర్యంలో నిర్వహించారు, సమావేశంలో మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని, ఈ సర్వే సమయంలో బూత్ లెవెల్ అధికారులు మీ ఇంటికి వచ్చినప్పుడు ఓటర్ కార్డులో పేర్లు వయసు చిరునామాలు ఉన్న తప్పులను సరి చేసుకోవాలని, మరణించిన వారు, చిరునామా మారిన వారి నీ గ్రహించి సరి చేయించాలని, ప్రతి గ్రామంలో ఓటర్ల లిస్టు అంశాలపై సమీక్ష నిర్వహించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో సాగునీటి అధ్యక్షుడు నగరడోన కిష్టప్ప, రామదుర్గం తిమ్మయ్య, కొండా తులసి, వైకుంఠ వెంకటేశ్వర్లు, కొలిమి శీను, జనార్ధన్ స్వామి, బోగేస్ స్వామి, రామదుర్గం మాధవులు, నంచర్ల శివలింగ, దౌల్తాపురం మేకల రామాంజనేయులు, ఖాజీపురం ఓబయ్య, చిప్పగిరి గోపాల్, నంచర్ల తిమ్మప్ప, సంఘాల చంద్ర, తదితరులు పాల్గొన్నారు.ద

# గుత్తి ఫోర్ట్ రైల్వే స్టేషన్‌లో యోగా శిక్షణ కార్యక్రమం




**అనంతపురం/ గుత్తి జూన్ 10 (రిపబ్లిక్ న్యూస్)** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గుత్తి ఫోర్ట్ రైల్వే స్టేషన్‌లో యోగా శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గుత్తి జంక్షన్ ఐఓడబ్ల్యూ నాగేశ్వర్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గుత్తి మునిసిపల్ కమిషనర్ జబ్బార్ మియా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఆర్‌కే యోగా టీం మాస్టర్లు రామకృష్ణ, కృష్ణయ్యల ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహించబడింది. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని వారు వివరించారు.ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయభాస్కర్, ఉపాధ్యక్షులు సుధాకర్ నాయుడు, మునిసిపల్ మేనేజర్ రాంబాబు, స్టోర్ నాగరాజు, ప్రసాద్ రెడ్డి, డోలాక్ షఫీ, ఆటో యూనియన్ నాయకులు నజీర్, భాష, ఆర్‌కే యోగా టీం సభ్యులు, రైల్వే ఉద్యోగులు, సంరక్షణ సమితి సభ్యులు, ప్రయాణికులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగగా, యోగ సాధన యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు.

# శ్రీవారి సన్నిధిలో జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు



**తిరుమల, ప్రతినిధి, జూన్ 10,( రిపబ్లిక్ న్యూస్ ):** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్న ఆయన, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్ మురళితో కలిసి బుధవారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు.

**విద్య, వైద్యం, రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలి**

ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయాల ప్రకారం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన పూల నాగరాజు, రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యవసాయం, పారిశ్రామిక రంగం, విద్య, వైద్యం, ఉపాధి తదితర అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఎముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన కొనసాగాలని స్వామివారి ఆశీస్సులు కోరినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి, భద్రతలు నెలకొని ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని ప్రార్థించినట్లు తెలిపారు.

దర్శనానంతరం ఆలయ వేదపండితులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందించి సత్కరించారు. శ్రీవారి దర్శనం అత్యంత ప్రశాంతతను, ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని పూల నాగరాజు తెలిపారు.

తిరుమల శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించాలని, ప్రతి కుటుంబంలో సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. శ్రీవారి సన్నిధిలో తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని, ప్రజల సేవలో మరింత అంకితభావంతో పనిచేసేందుకు ఇది ప్రేరణనిచ్చిందని ఆయన పేర్కొన్నారు.

# కూటమి పార్టీల కార్యకర్తలు సమిష్టిగా ముందుకు సాగాలి

## గెలుపే లక్ష్యం గా పని చేయాలి,-చీఫ్ వీప్ బొలి శెట్టి.









**రైల్వే కోడూరు జూన్ 10రిపబ్లిక్ న్యూస్.** రైల్వే కోడూరు నియోజక వర్గ కూటమి కార్యకర్తలు అందరూ సమిష్టిగా రాబోయే స్థానిక సమస్తల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని తాడేపల్లి గూడెం జనసేన పార్టీ శాసనసభ్యులు ప్రభుత్వ చీఫ్ వీప్ బొల్లిశెట్టి శ్రీనివాసులు కార్యకర్తలకు మంగళవారం రాత్రి రైల్వే కోడూరు జనసేన పార్టీ కార్యాలయం లో జరిగిన కార్యకర్తల సమావేశంలో అయన పిలుపు నిచ్చారు,

ఎన్నిక్షల సమయం దగ్గర పడుతోందని, నాయకులు కార్యకర్తలు, కూటమి పార్టీల అభిమానులు సమస్యలు ఉంటే పక్కనపెట్టి కూడా చెర్మన్ కోడూరు టీడీపీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి, కోడూరు జనసేన పార్టీ శాసన సభ్యులు ఆరవ శ్రీధర్ నాయకత్వంలో కూటమిని అభివృద్ధి పదంలో గెలుపే దీమాగా నడవాలన్నారు,అంతకుముందు కోడూరుకు విచ్చేసిన బొల్లిశెట్టికి కూడా చెర్మన్, టీడీపీ అధ్యక్షులు రూపానంద రెడ్డి,ఎంమ్మెల్యే శ్రీధర్ ఇద్దరు ఆయనకు పుష్ప గుచ్ఛాం ఇచ్చి శాలువా కప్పి ఘన స్వాగతం పలికారు, అనంతరం రూపానంద రెడ్డి మాట్లాడుతూ

జనసేన పార్టీలో నే కాకుండా కూటమి ప్రభుత్వంలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా కూడా తనదైన శైలిలో స్పందిస్తూ ముందుకు కొనసాగుతూ న్నమ్మన్నారు,ప్రభుత్వ చీఫ్ విప్ గా పదవి బాధ్యతలు తనదేన శైలిలో నిర్వర్తిస్తూ ముందుకు కొనసాగుతూ అటు కార్యకర్తకు ఇటు ప్రజలకు సమన్వయం చేస్తున్నబొల్లిశెట్టి శ్రీనివాసులుకి రైల్వే కోడూరు కి విచ్చేసిన నేపథ్యంలో ఆయనకు ఘనస్వాగతం పలుకుతూ భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నాను అని ఆయన అన్నారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రైల్వే కోడూరు కి జనసేన పార్టీ బాహుబలి బొల్లి శెట్టి శ్రీనివాసులు మా ఆహ్వానం మేరకు రావడం మాకు చాలా గర్వకారణం అని ఇటువంటి పెద్దలు రైల్వేకోడూరుకి విచ్చేసి జనసేన పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయడం శుభ పరిణామంగా భావిస్తూ పెద్దల అడుగుజాడల్లో ముందుకు కొనసాగుతామని,ముక్కా రూపానంద రెడ్డి ఆశీస్సులతో రైల్వే కోడూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాలను ముందుకు తీసుకు వెళ్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయభేరి మోగిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి తాతం శెట్టి నాగేంద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి జన సైనికులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

**బొలిశెట్టి సమక్షంలో రగడ....**

కోడూరు జనసేనపార్టీ కార్యాలయం లో జనసైనికులు బోలిశెట్టి సమక్షంలో గొడవ పడ్డారు పార్టీ గెలుపు కోసం కష్ట పడి పనిచేసితే మాకు మొండి చెయ్యి చూపి పక్కన పడేసారని ఆవేదన వ్యక్తం చేశారు,మాకు నిజమైన జనసేన ఇంచార్జి నీ కోడూరులో నియమించాలని కార్యకర్తలు ఆయన్ను కోరారు, అధినేత దృష్టికి తీసుకెల్లి న్యాయం జరిగేలా చూస్తానని వారికి హామీ ఇచ్చారు,

# ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో దారుణం

## చిన్నారిని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన దుండగుడు -భయభ్రాంతులకు గురై కేకలు వేసిన చిన్నారి

## ఆసుపత్రిలో రోజుకొక సంఘటన -నిద్రమత్తు వదలని సెక్యూరిటీ సిబ్బంది -దొంగతనాలు,చిన్నారులపై అఘాయిత్యాలకు నిలయం







**అనంతపురం క్రైమ్, జూన్ 10, (రిపబ్లిక్ న్యూస్):** అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వరుస దారుణ సంఘటనలు జరుగుతున్నాయి. గుర్తు తెలియని దుండగుడు చిన్నారులను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించాడు.

చిన్నారి కేకలు వేయడంతో ఆసుపత్రి ఆవరణంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో రోగులు వారి బంధువులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చిన్నారి కేకలు వేయడంతో అక్కడున్న జనం గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. దీంతో అక్కడున్న ప్రజలు ఒక్కసారిగా ఊపిరి పీల్చలేకపోయారు. ఏమైందో ఏమో అని జనం గుమిగూడి చూసేలోపు దుండగుడిని పట్టుకున్నారు. ప్రజలు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పిందని చెప్పవచ్చు.

### భద్రత కరువైందని రోగులు, వారి బంధువులు ఆవేదన

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో భద్రతా లోపాల కారణంగా దారుణ సంఘటనలు నెలకొన్నాయి. తాజాగా ఆసుపత్రిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి చిన్నారిని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన ఘటన అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కలకలం రేపింది. అప్రమత్తమైన చిన్నారి భయంతో కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని అనుమానతుడని పట్టుకున్నారు.ఈ ఘటనతో ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇప్పటికే ఆసుపత్రిలో తరచూ దొంగతనాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.రోజుకో సంఘటన జరుగుతున్నప్పటికీ ఆసుపత్రిలో భద్రత కరువైందని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో భద్రతా సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందులో భాగంగా కొందరు సెక్యూరిటీ సిబ్బంది విధుల్లోనే నిద్రపోతుండటంతో ఆసుపత్రి ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి అధికారులు, పోలీసులు చిన్నారులు, మహిళల భద్రత విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రి పరిధిలోని సీసీ కెమెరాల పనితీరును సమీక్షించి, అదనపు భద్రతా సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై ఆసుపత్రి యాజమాన్యం, పోలీసు అధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు చిన్నారులను ఎత్తుకెళ్లే దుండగుడిని సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### సీసీ కెమెరాల పర్యవేక్షణ నిర్వహణపై తీవ్ర విమర్శలు

రోజుకొక సంఘటన వెలుగులోకి వస్తుండటంతో రోగులు, వారి బంధువులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.దొంగతనాలు, వార్డుల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, రోగుల వస్తువులు మాయం కావడం వంటి ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.ఆసుపత్రిలో వందలాది మంది రోగులు, సహాయకులు తిరుగుతున్నప్పటికీ భద్రత మాత్రం ప్రశ్నార్థకంగా మారిందని చెప్పవచ్చు. సీసీ కెమెరాల పర్యవేక్షణ, సెక్యూరిటీ సిబ్బంది విధుల నిర్వహణపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఘటనలు జరిగిన తర్వాతే అధికారులు స్పందించడం తప్ప ముందస్తు చర్యలు కనిపించడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.ఆసుపత్రి అధికారులు వెంటనే స్పందించి భద్రతను కట్టుదిట్టం చేయకపోతే మరింత తీవ్రమైన ఘటనలు జరిగే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

### భద్రతా లోపాల కారణంగా అవాంఛనీయ ఘటనలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వరుస ఘటనలతో వివాదాల కేంద్రంగా మారుతోంది. రోగుల వస్తువులు కూడా మాయమవుతున్నట్లు రోగుల బంధువులు చెబుతుండడం గమనార్హం. అనుమానాస్పద వ్యక్తుల సంచరిస్తుండడంతో చిన్నారులను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన సంఘటన ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి.ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు అధికంగా ఉండే ప్రదేశంలో కట్టుదిట్టమైన నిఘా అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.వేలాది మంది రాకపోకలు సాగించే ఆసుపత్రిలోకి ఎవరు వస్తున్నారు, ఎవరు వెళు_న్నారు అన్న దానిపై పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భద్రతా లోపాల కారణంగా దొంగతనాలు,అవాంఛనీయ ఘటనలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భద్రతా ఏర్పాట్లను బలోపేతం చేసి, రోగులు, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18న వినియోగంలో లేని వస్తువుల వేలం

**నంద్యాల క్రైం, జూన్ 10, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ గారి ఆదేశాలమేరకు పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల డిఏస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఈనెల 18వ తేదిన పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంటల వరకు వినియోగించదగని కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానేర్లు, ట్యాబులు, జెనరేటర్లు, యుపిఎస్ బ్యాటరీలు, ఇతర వస్తువులు బహిరంగ వేలం నిర్వహించబడునని బుధవారం ఓ ప్రకటనలో జిల్లా ఎస్పీ తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలచిన ఔత్సాహికులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతితో పాటు రూ.1,000/- దరావత్తు సొమ్ము చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చు. చెల్లించిన దరావత్తు సొమ్ము ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి చెల్లించబడదని వారు పేర్కొన్నారు. వేలంపాటలో సరుకు దక్కించుకున్న వారు, నిర్ణయించబడిన మొత్తాన్ని అక్కడికక్కడే నగదు రూపంలో చెల్లించాలని అన్నారు. వేలం ద్వారా కొనుగోలు చేసిన వస్తువులపై 18 శాతం జీఎస్టీ అదనంగా వర్తించును.కావున ఆసక్తి గల ప్రజలు వేలంపాటలో పాల్గొని అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరడమైనది. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన వారు ఆర్ఐ వెల్ఫేర్ నెంబర్లను 9121101052,9966966807 సప్రదించాలన్నారు.

## దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్ధంతి

### - పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి వేడుకలు

**అనంతపురం/ గుత్తి జూన్ 10 (రిపబ్లిక్ న్యూస్)**




అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్ సమీపంలోని పెన్షనర్ల భవనంలో ప్రెసిడెంట్ అబూబకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 98వ వర్ధంతి మరియు భారత జాతీయ ప్రతిజ్ఞ "భారతదేశం నా మాతృభూమి" రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు 110వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, పైడిమర్రి వెంకట సుబ్బారావు చిత్రపటాలకు కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, జాయింట్ సెక్రటరీ వెంకటేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ, పైడిమర్రి వెంకట సుబ్బారావు ప్రముఖ రచయిత, బహుభాషా కోవిదుడు అని, భారత జాతీయ ప్రతిజ్ఞ రచయితగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు.అలాగే ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్వాతంత్ర్య సమరయోధుడిగా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ప్రజల్లో చైతన్యం కల్పించారని పేర్కొన్నారు. చీరాల ఉద్యమంలో ఆయన పాత్ర విశేషమని, బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడినందుకు ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష కూడా అనుభవించారని వివరించారు.కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు మాట్లాడుతూ, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య 1928 జూన్ 10న క్షయవ్యాధితో రామ్‌నగర్‌లో పరమపదించారని తెలిపారు. వారి సేవలను స్మరించుకుంటూ యువత దేశభక్తి, సామాజిక సేవా భావాలను అలవరచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, గౌరవాధ్యక్షులు ఫక్రుద్దీన్, లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటేష్, స్వామిదాస్, శామ్యూల్, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, నరసింహులు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.ద

## తాసిల్దార్, సబ్ ఇన్స్పెక్టర్ లను కలిసిన పోలం రెడ్డి.

**రైల్వే కోడూరు జూన్ 10 రిపబ్లిక్ న్యూస్.**





ఓబులవారిపల్లి మండల నూతన తాసిల్దార్ గా బాధ్యతలు సిద్దేశ్వర రావు ని మరియు ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సుజన్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసినట్లు రాష్ట్ర అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు పోలంరెడ్డి అన్నారు, మాల మహానాడు రాష్ట్ర నాయకులు గుంజుపల్లి జయరాజ్, అంబేద్కర్ సేవా సమితి గౌరవ అధ్యక్షులు గాలిశెట్టి మనోహర్, ప్రధాన కార్యదర్శి కొరముట్ల వెంకటసుబ్బయ్య బుధవారం మండల రెవెన్యూ అధికారి కార్యాలయంలో తాసిల్దార్ సిద్దేశ్వర రావు ని కలిసి పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించడం జరిగినది అనంతరం సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ ని కలిసి ఆయనకు పూలమాలవేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించడం జరిగినది అనంతరం వారు ఇరువురు అధికారులతో మాట్లాడి మండలంలో దళితుల సమస్యలు చాలా ఉన్నాయని ఆ విషయాన్ని మీ దృష్టికి తీసుకురావడం జరుగుతుందని సహృదయంతో దళితుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను వారు కోరారు ఈ నేపథ్యంలో తాసిల్దార్ సిద్దేశ్వర రావు మాట్లాడుతూ మండలంలో దళితుల, పేదల,బడుగు, బలహీన, మైనారిటీ వర్గాలకు సంబంధించిన ఎలాంటి భూ సమస్యలు ఉన్న వాటిన అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని ఈ సందర్భంగా వారికి హామీ ఇవ్వడం జరిగినది, మండలంలో డ్రగ్స్ గంజాయి వంటి మాదకద్రవ్యాలపై దృష్టి పెట్టాలని వాటి వల్ల యువత పేడత్రోవ బడుతున్నారని, రైతుల పొలాలలో ట్రాన్స్ఫార్మర్లు వైర్లు మోటర్లు దొంగతనాలు జరుగుతున్నాయని వీటన్నిటి పైన తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు స్పందించిన సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు డ్రగ్స్ దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారికి హామీ ఇవ్వడం జరిగినది

## తహసిల్దార్ కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి

### విజయకుమారి కు ఘన సన్మానం

### ప్రజా సేవలకు గాను అభినందనలు తెలిపిన ఎమ్మార్పీఎస్ నాయకులు




**అనంతపురం / రాప్తాడు, జూన్ 10,(రిపబ్లిక్ న్యూస్):**రాప్తాడు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన విజయకుమారికి బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘన సన్మానం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పూజారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పూజారి చెన్నకేశవులు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా రాప్తాడు మండలంలో ప్రజలకు, రైతులకు విజయకుమారి అందించిన సేవలు ప్రశంసనీయమని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఆమె చూపిన చొరవ మండల ప్రజల మన్ననలు పొందిందని పేర్కొన్నారు.రాప్తాడు నుంచి పదోన్నతిపై శ్రీ సత్యసాయి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న విజయకుమారికి దళిత ప్రజా సంఘాల తరపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో మరింత రాణించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, మండల సహాయ కార్యదర్శి పి. కరుణాకర్, కురుగుంట గోవిందు తదితరులు పాల్గొని విజయకుమారిని సన్మానించారు

# తాగునీరు, విద్యుత్, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**నీటి ఎద్దడిపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలి**

**జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి**

**సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**




**నంద్యాల బ్యూరో, జూన్ 10 (రిపబ్లిక్ న్యూస్):** ఉమ్మడి కర్నూలు జిల్లాలో తాగునీటి సమస్యలు, విద్యుత్ భద్రత, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో నీటి ఎద్దడిని నివారించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, విద్యాశాఖ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కర్నూలు జిల్లా కలెక్టర్ డా. ఎ. సిరి, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా పరిషత్ సీఈఓ రమణారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి వాల్మీకి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, ఉభయ జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మదర్ వాటర్ ప్లాంట్లు, ఆర్డబ్ల్యూఎస్ వాటర్ ప్లాంట్లను పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 167కే రహదారి నిర్మాణంలో భాగంగా పైప్‌లైన్ల తొలగింపుకు ముందు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నీటి ఎద్దడి అధికంగా ఉందని, వర్షపాతం నమోదవుతున్నప్పటికీ నీటి నిల్వల కోసం తగిన రిజర్వాయర్లు లేకపోవడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ, నిల్వలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, వాటిని వెంటనే సరిచేసి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం సకాలంలో అందించాలని, శాఖలో సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యాశాఖలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలని, పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపు కోసం అమలు చేస్తున్న ప్రత్యేక కార్యాచరణకు మరింత ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు.

### సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

అనంతరం సమావేశంలో సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలు, అభ్యర్థనలపై జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖకు సంబంధించి జిల్లాలో ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ఈ-క్రాప్ నమోదైన ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు. పంట మార్పిడి చేసిన రైతులకు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. దొర్నిపాడు మండలంలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు విషయంలో భద్రతా చర్యలు చేపట్టి ప్రమాద హెచ్చరిక బోర్డులు, కంచె ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. కొత్తపల్లి మండలంలో 167కే రహదారి నిర్మాణంలో భాగంగా రైతుల భూముల నుంచి మట్టి తవ్వకాలపై వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గడివేముల మండలం సోమాపురంలో ఇళ్లపైకి దిగువకు వచ్చిన విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలను పంపించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా నాణ్యమైన విద్యుత్ సరఫరా కల్పించేందుకు చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అలాగే గువ్వలకుంట్ల-చిన్నపాలెం-సదరంచెరువు-ఎర్రగుడి చెరువు రహదారి పనులను వేగవంతం చేయాలని, ఆత్మకూరు నుంచి గువ్వలకుంట్ల వరకు విద్యార్థుల రాకపోకల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి..

**అనర్హుల పేర్లకు తావివ్వొద్దు**

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి: బీఎల్ఓలకు కలెక్టర్ దిశానిర్దేశం**

**జూలై 21న డ్రాఫ్ట్ ఓటరు జాబితా.. సెప్టెంబర్ 22న తుది జాబితా విడుదల**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**






**నంద్యాల బ్యూరో, జూన్ 10 (రిపబ్లిక్ న్యూస్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ 2026 కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బూత్ స్థాయి అధికారులకు (బీఎల్ఓలు) సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో బనగానపల్లె, డోన్ నియోజకవర్గాలకు చెందిన బీఎల్ఓలు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ లు స్వయంగా పాల్గొని మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో అనర్హుల పేర్లు ఓటరు జాబితాలో చేరకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఖచ్చితమైన సమాచారంతో ఓటరు జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 ప్రకారం ఓటరు జాబితాల రూపకల్పన, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఎన్నికల నిర్వహణ జరుగుతుందని వివరించారు. తప్పుడు వివరాలతో డిక్లరేషన్ సమర్పించే ఓటర్లపై ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్-31 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన అధికారులపై సెక్షన్-32 కింద కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. జూన్ 15 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం కానున్నప్పటికీ, అప్పటి వరకు వేచి ఉండకుండా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని వెంటనే ప్రారంభించాలని బీఎల్ఓలకు ఆదేశించారు. ప్రతి అర్హ ఓటరుకు ఫారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు రాజకీయ పక్షపాతం లేకుండా పూర్తిగా తటస్థంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారనే భావన కలగకుండా ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఓటరుగా నమోదు కావడానికి భారతీయ పౌరసత్వం కలిగి ఉండటం, 2026 జూలై 1 నాటికి 18 సంవత్సరాల వయస్సు పూర్తి కావడం, సంబంధిత ప్రాంతంలో సాధారణ నివాసిగా ఉండటం వంటి అర్హతలు అవసరమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను సేకరించి డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు. ఒకే ఫారాన్ని పునరావృతంగా డిజిటలైజ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డిజిటలైజ్ చేసిన ఫారాలపై స్పష్టమైన గుర్తింపు ఉండాలని పేర్కొన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి రాని సందర్భాల్లో కేవలం 'ఆబ్సెంట్', 'షిఫ్టెడ్', 'డెత్', 'డూప్లికేట్' అనే నాలుగు కారణాలను మాత్రమే నమోదు చేయాలని సూచించారు. ఈ వివరాల ఆధారంగా బూత్ వారీగా ప్రత్యేక జాబితాలు తయారు చేసి ప్రజల అభ్యంతరాల కోసం అందుబాటులో ఉంచాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాను జూలై 21న ప్రచురించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అనంతరం క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుందని, ఫారం6 ద్వారా కొత్త ఓటరు నమోదు, ఫారం7 ద్వారా పేర్ల తొలగింపు, ఫారం8 ద్వారా వివరాల సవరణ లేదా నియోజకవర్గ మార్పులు చేపట్టవచ్చని వివరించారు. అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్స్ పరిష్కరించిన అనంతరం సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలతో పాటు ఆధార్, రేషన్ కార్డు, పాత ఎపిక్ కార్డు వంటి పత్రాల జిరాక్స్ కాపీలు సేకరించవద్దని సూచించారు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే ఎన్నికల సంఘం సూచించిన గుర్తింపు లేదా నివాస ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకటి స్వీకరించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్లను ఆదేశించారు. జూలై 14లోపు పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రతిపాదనలను ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పోలింగ్ కేంద్రాల విభజన చేపట్టాలని, అయితే ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఆర్ఓలను ఆదేశించారు. అలాగే ప్రతి ఏఈఆర్ఓ కార్యాలయంలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి, హెల్ప్‌లైన్ నంబర్ 1950ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. సిస్టమ్ గుర్తించిన లోపాలు, వ్యత్యాసాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, డోన్, బనగానపల్లె ఆర్డీఓలు, సంబంధిత నియోజకవర్గ మండలాల బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ అద్భుతం.. ఇక దేశమంతా ఇదే విధానం!

**దేశవ్యాప్తంగా రేషన్ బియ్యం బస్తాలకు క్యూఆర్ కోడ్ విధానం**

**తిరుపతిలో ప్రకటన చేసిన కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి**

**జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**

దేశవ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా సరఫరా చేసే బియ్యం బస్తాలపై ఇకపై క్యూఆర్ కోడ్ విధానాన్ని అమలు చేయనున్నట్లు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ నూతన విధానం ద్వారా రేషన్ బియ్యం పంపిణీలో పారదర్శకత పెరగడమే కాకుండా, అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం తిరుపతిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పర్యవేక్షణ అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఏపీలో అమలు చేస్తున్న క్యూఆర్ కోడ్ విధానం వల్ల రేషన్ బియ్యం పక్కదారి పట్టడం ఆగిపోయిందని, మిల్లింగ్ పాయింట్ నుంచి లబ్ధిదారుడికి చేరే వరకు ప్రతి దశను కచ్చితంగా ట్రాక్ చేసే వీలు కలిగిందని వివరించారు. ఈ విజయవంతమైన 'ఏపీ నమూనా' ఆధారంగానే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని విస్తరిస్తున్నట్లు తెలిపారు.పీడీఎస్ వ్యవస్థను ఆధునికీకరించడం, అక్రమాలను అరికట్టి సబ్సిడీ ఆహార ధాన్యాలు అర్హులైన లబ్ధిదారులకే చేరేలా చూడటమే ఈ చర్యల ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లోనూ ఈ విధానాన్ని విస్తరించేందుకు కేంద్రం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా, సాంకేతికత ఆధారంగా సమర్థవంతమైన పాలన అందించడంలో భాగంగానే ఈ విధానాన్ని తీసుకువచ్చినట్లు జోషి వివరించారు.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అందిస్తున్న సహాయం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే రాష్ట్రానికి 325 శాతం అధికంగా నిధులు కేటాయించామని తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్రం తరపున పూర్తి సహకారం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# జిల్లా ఆర్థికాభివృద్ధికి హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాలే కీలకం

## వనరులను సమర్థవంతంగా వినియోగిస్తే నంద్యాలను రాష్ట్రంలోనే అగ్రగామి జిల్లాగా తీర్చి దిద్దవచ్చు

## ప్రజలకు వేగవంతమైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం -జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా






**నంద్యాల బ్యూరో, జూన్ 10( రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లాలో అపారమైన సహజ, మానవ వనరులు ఉన్నప్పటికీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోవడం వల్ల అభివృద్ధి అవకాశాలు పరిమితమవుతున్నాయని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అభివృద్ధి, ప్రజల ఆదాయ వృద్ధి, ప్రభుత్వ సేవల మెరుగుదలపై గుర్తింపు పొందిన సేవాసంఘాల సభ్యులతో మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయ మరియు అనుబంధ రంగాల వాటా 42 శాతం, సేవా రంగం వాటా 39 శాతం ఉండగా, పారిశ్రామిక రంగం వాటా కేవలం 19 శాతం మాత్రమే ఉందన్నారు. పరిశ్రమల ద్వారా వచ్చే ఆదాయం తక్కువగా ఉండటం వల్ల జిల్లా ఆర్థికాభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగడం లేదని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు అధిక ఆదాయం అందించే రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ప్రస్తుతం కేవలం 37 వేల హెక్టార్లలో సాగవుతున్న హార్టికల్చర్ పంటల ద్వారా సుమారు రూ.7 వేల కోట్ల ఆదాయం లభిస్తుండగా, దాదాపు 2.5 లక్షల హెక్టార్లలో సాగవుతున్న వరి మరియు ఇతర సాంప్రదాయ పంటల ద్వారా కేవలం రూ.3 వేల కోట్ల ఆదాయం మాత్రమే వస్తోందని వివరించారు. ఈ గణాంకాలే తోటపంటల ఆర్థిక ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేస్తున్నాయని అన్నారు. రైతుల ఆదాయాలను పెంచాలంటే హార్టికల్చర్, పశు సంవర్ధక రంగాల విస్తరణకు అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నంద్యాల జిల్లాలో వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరులలో 20 శాతం కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నామని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు కేవలం కార్యాలయాల్లో కూర్చుని ఫైళ్లు క్లియర్ చేయడం మాత్రమే కాకుండా, ప్రజల అవసరాలను అర్థం చేసుకుంటూ సానుభూతి, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం, జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఉద్యోగుల నుండి పనితీరు మెరుగుపరచడానికే తన సమయం ఎక్కువగా వెచ్చించాల్సి వస్తోందని, దీంతో కొత్త అభివృద్ధి కార్యక్రమాలపై మరింత దృష్టి సారించే అవకాశాలు తగ్గిపోతున్నాయని ఆమె పేర్కొన్నారు. ప్రతి శాఖ అధికారి బాధ్యతాయుతంగా పనిచేస్తే జిల్లా అభివృద్ధి వేగవంతం అవుతుందని చెప్పారు. గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు ప్రాధాన్యత ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు సేవలు ఎంత వేగంగా, సమర్థవంతంగా అందుతున్నాయన్నదే ప్రభుత్వ పనితీరుకు కొలమానంగా మారిందన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించేందుకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఉద్యోగులు ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనిచేయాల్సిన సందర్భంలో కొన్నిసార్లు రాజకీయ ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో నిజాయితీగా, నిబంధనల ప్రకారం పనిచేసే ఉద్యోగులకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రతి ఉద్యోగి తటస్థ వైఖరితో వ్యవహరిస్తూ, సర్వీస్ మరియు క్లాసిఫికేషన్ నిబంధనలను పాటిస్తూ విధులు నిర్వర్తిస్తే చాలా సమస్యలు సులభంగా పరిష్కారమవుతాయని తెలిపారు. జిల్లా అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే నంద్యాల జిల్లాను రాష్ట్రంలోనే టాప్-5 జిల్లాల్లో ఒకటిగా నిలబెట్టడం సాధ్యమవుతుందని కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.

# అవుకు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**అవుకు, జూన్ 10 రిపబ్లిక్ న్యూస్**
అవుకుమోడల్ స్కూల్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి మిగిలి ఉన్న 6వ 7వ 8వ, 9వ తరగతులు మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హేమీమా తెలిపారు.
దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జూన్ 10 నుంచి జూన్ 20 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాల కోసం జూన్ 24న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను జూన్ 25న ప్రకటించి, జూన్ 26న సర్టిఫికేట్ పరిశీలనతో పాటు ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మిగిలిన ఖాళీలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థానిక, స్థానికేతర అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హేమీమా కోరారు.

# శివాలయ అక్రమాలపై స్పందించిన అధికారులు.. ఆలయ ఖాతా ప్రారంభం

**అవుకు జూన్ 10 రిపబ్లిక్ న్యూస్**
అవుకు పట్టణంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి ఆరోపణలపై స్పందించిన అధికారులు ఆలయానికి ప్రత్యేక బ్యాంకు ఖాతాను ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఆలయ ఈవో బాల చెంచన్న మాట్లాడుతూ, ఆలయంలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఖాతా ప్రారంభించినట్లు తెలిపారు. భక్తులు దేవాలయానికి అందించే విరాళాలను నేరుగా ఆలయ ఖాతాలోనే జమ చేయాలని ఆయన కోరారు. అలాగే ఆలయంలో జరిగే వివాహాలు, కార్తీకమాసంలో వసూలు చేసే చందాలు, వాటర్ ట్యాంకుల ద్వారా వచ్చే ఆదాయం సహా అన్ని రకాల నిధులను ఖాతాలో జమ చేసి పారదర్శకంగా నిర్వహించనున్నట్లు ఈవో వెల్లడించారు. ఆలయ ఆదాయ-వ్యయాల నిర్వహణలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన తెలిపారు.

# గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించినప్పుడే గో సంరక్షణ

## బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణజీరావు గొర్రెలు బర్రెల వలె గోవులను కూడా రైతులకు సబ్సిడీలో ఇవ్వాలి

## దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు, గో సంరక్షణ సభ్యుడు సఫారే గోవిందరాజు డిమాండ్




**కర్నూలు ప్రతినిధి, జూన్ 10(రిపబ్లిక్ న్యూస్)**
గోవులను జాతీయ ప్రాణంగా ప్రకటించినప్పుడే దేశవ్యాప్తంగా గోసంరక్షణ సాధ్యపడ తొందని బిసి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణాజీ రావు పేర్కొన్నారు. ఈమేరకు ఆయన బుధవారం స్థానిక బీసీ సమావేశ భవనంలో మాట్లాడుతూ ఎన్నో వందల ఏళ్ల నుంచి గోమాతని భారతీయ సంప్రదాయంలో మన ఇంటి దేవతగా పూజిస్తూ ప్రతిరోజు ఆరాధించేవారన్నారు. ఏ కరువు కాటకాలు వచ్చిన ఆ ఇంట్లో గోమాత ఉందంటే వారికి ఆహారానికి ఎలాంటి ఇబ్బందులు ఉండేది కాదన్నారు. ప్రస్తుత కాలంలో కూడా గోవులను మనం సంరక్షిస్తే ఆ గోవులే మనకు కావలసినంత సంపాదన సృష్టిస్తాయని అందుకే గోవులను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరు ఆరాధ్య దైవంగా భావించి సంరక్షించాలని ఆయన కోరారు. అనంతరం సఫారీ గోవిందు రాజులు చేపట్టిన గో సంరక్షణ దీక్షకు మద్దతు తెలిపి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా గో సంరక్షణ దీక్షపరుడు సఫారీ గోవిందు రాజు మాట్లాడుతూ మనకు ప్రభుత్వాలు రైతుల కోసం గొర్రెలు, బర్రెలు ఎలాగైతే సబ్సిడీలో అందిస్తున్నారో, అలాగే గోవులను కూడా సబ్సిడీ ధరలలో రైతన్నలకు అందించి వాటి సంరక్షణకు పాటుపడాలని ఆయన కోరారు. రాష్ట్రంలో అన్న క్యాంటీన్లకు అన్ని రకాల ప్రోత్సాహకాలు ఆనందిస్తున్నారో, అలాగే గోమాతలకు కూడా పోషణ సంరక్షణ ను అందించి గోవులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఎంతో మంది గోమాతలను రక్షించి వాటి ఎదుగుదలకు పాటుపడుతున్నారో.. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక పథకాలను కేటాయించి గోవుల సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, ప్రసాద్, మల్కారి ప్రసాద్, విద్యాసాగర్, సాయి కాంతారావు, టి సురేష్, ఎం నాగరాజు విజయవంతం తదితర మరాఠీ సంఘ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బహుదూర్ ఖాన్ ఫంక్షన్ హాల్ కు నిధులు విడుదల



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జూన్ 10 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఈరోజు 3కోట్ల రూపాయలతో చేపట్టిన బహుదూర్ ఖాన్ ఫంక్షన్ హాల్ నందు నూతనంగా నిర్మాణం చేయడానికి చుట్టు ముట్టు కొలతలు చేసి భవనం నిర్మాణం చేపట్టడానికి గౌరవ మంత్రి వర్యులు దామోదర రాజనరసింహ గారు తెలియ జేయడం జరిగింది ఈరోజు గౌరవ మున్సిపల్ చైర్మన్ కృష్ణ రెడ్డి అన్న గారు వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) గారు కమీషనర్ తిరుపతి సార్ గారు ఒకటవ వార్డు కౌన్సిలర్ గడ్డి అరుణ్ కుమార్ గారు ఖవ శ్రీకాంత్ గారు కో ఆప్షన్ మెంబర్ జీషన్ ఆత్మ కమిటి డైరెక్టర్ ఖాలేదు అబ్బాస్ భాయ్ అనిల్ దుర్గేష్ మైనారిటీ సోదరులు పాల్గొన్నారు

# కార్యకర్తలకు అండగా ఉంటాం సమిష్టిగా పనిచేయండి.

## రూపానంద రెడ్డి.





**రైల్వే కోడూరు జూన్ 10రిపబ్లిక్ న్యూస్.**
రైల్వే కోడూరు టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఓబులవారిపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కూడా చైర్మన్ రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కారూపానంద రెడ్డి,టీడీపీ యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు,
ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు,సమీపిస్తున్నాయని కార్యకర్తలకు భరోసా ఇలా పలు అంశాలపై చర్చించారు
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసి ఎటువంటి భేద భావాలకు పోకుండా, ఎన్ డి ఏ కూటమిలో భాగమైన జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలతో సమిష్టిగా ఐక్యమత్యంగా కలిసి మెలిసి ఒక సహృదయం అయినటువంటి మంచి వాతావరణంలో మనమంతా ముందుకు కొనసాగుతూ ఎన్డీఏ కూటమి జెండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగరయాలని పిలుపునిస్తూ, ఏ కార్యకర్తకైనా సరే ,ఏ నాయకుడికైనా సరే ఏమైనా ఇబ్బందులు తలెత్తితేనా దృష్టికి తీసుకురావాలని ఆ విషయాలకు సంబంధించి స్పష్టంగా చర్చించి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని ఏ ఒక్కరు కూడా అధైర్య పడకుండా రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ప్రణాళికతో మనం ముందుకు కొనసాగాలని ప్రతి ఒక్కరికి తెలియజేస్తూ, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ా×= కార్యక్రమంలో భాగంగా మీ, మీ, పంచాయతీలలో పోలింగ్ బూత్ లకు సంబంధించి మార్పులు చేర్పులు విషయాలకు సంబంధించి ఇలా ఏదైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఏ చంద్రమోహన్, ఓబులవారిపల్లి మండల యువ నాయకుడు ఓబిలి ప్రసాద్ రెడ్డి, ఓబులవారిపల్లి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా చిన్నారి మిస్సింగ్ కేసులో కొత్త మలుపు

## తునిలో రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి అదృశ్యం

## శనివారం నుంచి కనిపించకుండా పోయిన బాలిక

## తిరిగి వచ్చిన పెంపుడు కుక్క.. చిన్నారి తల్లిని లాగి అడవిలోకి పరుగు

## వందలాది మంది పోలీసులతో 500 ఎకరాల్లో ముమ్మర గాలింపు

## వైరల్ అవుతున్న చిన్నారి వీడియోలు.. ఆచూకీ కోసం ఆందోళన



**కాకినాడ జూన్ 10, (ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కాకినాడ జిల్లా తుని మండలంలో రెండేళ్ల చిన్నారి సుంకర జ్ఞానేశ్వరి అదృశ్యం కేసులో ఉత్కంఠ కొనసాగుతోంది. చిన్నారితో పాటు మాయమైన పెంపుడు కుక్క తిరిగి రావడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. అయితే, చిన్నారి ఆచూకీ మాత్రం ఇప్పటికీ లభించకపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.వివరాల్లోకి వెళితే.. తుని మండలం సి.హెచ్. అగ్రహారానికి చెందిన వ్యవసాయ కూలీలు గణేష్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి శనివారం మధ్యాహ్నం ఇంటి వద్ద ఆడుకుంటూ పెంపుడు కుక్కతో పాటు అదృశ్యమైంది. అప్పటి నుంచి పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నా ఆచూకీ దొరకలేదు. కాగా, మంగళవారం మధ్యాహ్నం 3:30 గంటల సమయంలో జీడితోటల వద్దకు తిరిగి వచ్చిన పెంపుడు కుక్క, ఆందోళనగా ప్రవర్తించింది. తల్లి భవాని చున్నీ పట్టుకుని లాగి, మళ్లీ సమీపంలోని గుట్టల వైపు పరుగెత్తింది.ఈ పరిణామంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. డాగ్ స్క్వాడ్‌తో కలిసి కుక్క వెళ్లిన దారిలో రాత్రి వరకు గాలించినా ఫలితం లేకపోయింది. డీఎస్పీ తిలక్ నేతృత్వంలో వందలాది మంది పోలీసులు, సీఐలు సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలోని జీడితోటలు, కొండ ప్రాంతాల్లో డ్రోన్ల సహాయంతో జల్లెడ పడుతున్నారు. దర్యాప్తులో భాగంగా సమీపంలోని ఇనుప కంచె వద్ద లభించిన చిన్నారి, కుక్క వెంట్రుకల నమూనాలను పోలీసులు సేకరించి పరీక్షలకు పంపారు. మరోవైపు, జ్ఞానేశ్వరి తన చెల్లి ఉయ్యాల ఊపుతూ 'అమ్మా పాలు పట్టు' అని ముద్దుగా మాట్లాడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చిన్నారి క్షేమంగా తిరిగి రావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. చిన్నారి ప్రమాదవశాత్తు కొండల్లోకి వెళ్లిందా లేక ఎవరైనా అపహరించారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జై బాలయ్య నినాదాలతో దద్దరిల్లిన మెల్బోర్న్

## ఘనంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు -పాల్గొన్న సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ







**అనంతపురం ప్రతినిధి, జూన్ 10,(రిపబ్లిక్ న్యూస్):** ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ ఎన్ఆర్ఐ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్, ప్రముఖ సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జై బాలయ్య నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మార్మోగిపోయింది. మెల్ బోర్న్ నగరంలో జరిగిన నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలకు శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరయ్యారు. కేక్ కట్ చేసి బాలయ్య బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు.శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ , ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాలకృష్ణ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సినీ రంగంలో అగ్రనటుడిగా విశేష గుర్తింపు పొందిన బాలకృష్ణ ప్రజా నాయకుడిగా హిందూపురం నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేశారని కొనియాడారు. అంతేకాకుండా, బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్‌గా వేలాది మంది రోగులకు అండగా నిలుస్తూ అందిస్తున్న సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ప్రజా సేవ, సామాజిక సేవ, రాజకీయ రంగాల్లో ఆయన చేస్తున్న కృషి అందరికీ ఆదర్శమని అన్నారు. బాలకృష్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న బాలకృష్ణ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాలకృష్ణ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# గ్రామ సభలతో గ్రామాల అభివృద్ధి

**రోడ్డు ప్రమాదంలో ఏ ఒక్కరు ప్రణాలు కోల్పోకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలి**

**జిల్లా కలక్టర్ ప్రతిమా సింగ్**

**అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదాలు.**

**ప్రయాణంలో సురక్షితంగా గమ్యం చేరడం కోసం అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ఉద్యమం**

**రోడ్లపై పరిస్థితులను గమనిస్తూ ముందుకు సాగాలి**

**ఎక్కువ మంది హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు.**

**రోడ్డు ప్రయాణంలో అవగాహన, చైతన్యం, మార్పు రావాలి.**

**-అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన**







**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 10 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈరోజుమాసాయిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్గ్రామ సభలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత, పరిసరాల పరిశుభ్రత , అవగాహన కార్యక్రమం నిర్వహించి పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులు, పౌరులు లతో కలిసి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించడం జరిగినది, అనంతరం పౌరులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. పరిసరాల పరిశుభ్రత, అరైవ్ అలైవ్ ఈ అవగాహన ర్యాలీ, అవగాహన సదస్సుకు జిల్లా కలక్టర్ ప్రతిమా సింగ్,అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్,ఎస్పీ శ్రీనివాస్ రావు హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. పౌరులతో కలసి ర్యాలీ నందు పాల్గొన్నారు.కలక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ .. ప్రజల భాగస్వామ్యం తోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని లిగ్రామసభలతో ప్రజా సమస్యల పరిష్కారం పచ్చదనం, పారిశుధ్యంపై దృష్టి సారించాలి తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ పక్కాగా జరగాలని.. బహిరంగ ప్రదేశాల్లో అస్సలు చెత్త వేయకూడదని, తగుల బెట్టకూడదన్నారు పర్యావరణ పరిరక్షణ లో భాగం గా చెత్త విభజన, పరిసరాల పరిశు భ్రత మీద ప్రజలకి అధికారులు అవగాహన కల్పించాలన్నారు వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలని... పైపులైన్లకు మరమ్మత్తులు, నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు.
జిల్లా అభివృద్ధి, జిల్లా రక్షణ , పౌరుల రక్షణ ముఖ్యమైనది, పౌరుల భద్రత రక్షణలో పోలీసు శాఖ అనుక్షణం పని చేస్తుంది అని కలెక్టర్ తెలిపరూ. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అనేక రకాల అవగాహన కార్యక్రమాలు, గ్రామ సభలు నిర్వహిస్తున్నాం ప్రజలను చైతన్య పరుస్తున్నాం అన్నారు. అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ..జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. రోడ్డు ప్రమాదాల నివారణలో, రోడ్డు ప్రమాద మరణాలు సంభవించకుండా అధికారులు సంకల్పంతో పని చేయాలి పోలీస్, రోడ్డు ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ, ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను కాపాడి సహాయసహకారాలు అందిస్తే రహవీర్ గా గుర్తింపు వస్తుంది అన్నారు, రహదారి భద్రత ప్రతి ఒక్కరి భద్రత అన్నారు.అనంతరం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అంటే రోడ్డు పై ప్రయాణం చేసేసమాజంలో ప్రజలు, వాహనదారులు సురక్షితంగా గమ్యం చేరడం. ప్రతి సంవత్సరంకాలంలో తెలంగాణ వ్యాప్తంగా 7500 కు పైగా ప్రాణాలు కోల్పోతున్నారు అన్నారు, మన జిల్లాలో సగటున సంవత్సరానికి 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. అధిక ప్రమాదాలు నిర్లక్ష్యం, అజాగ్రత్త వల్లనే సంభవిస్తున్నాయి, తప్పుడు మార్గంలో వాహనాలు నడపడం, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, పిల్లలు వాహనాలు నడపడం, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి వీటిని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరు జాగ్రతగా అవగాహనలో వాహనాలు నడపాలి, రోడ్లపై ప్రయాణ సమాజంలో చైతన్యం మార్పు రావాలి అన్నారు. పోలీసు శాఖ అనుక్షణం అవగాహన కల్పిస్తూ ఎన్ఫోర్స్మెంట్ నిర్వహిస్తున్నది అన్నారు. డ్రైవింగ్ చేయాలాంటే, అన్ని అనుమతి పత్రాలు కలిగి ఉండాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఎక్కువ మంది హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోక పోవడం వల్లనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారు అని గంకాలు చెప్తున్నాయి అన్నారు. విద్యాసంస్థలు ప్రారంభం అవుతున్నాయి విద్యార్థులను బస్సులు, ఇతర వాహనాలు కండిషన్ లేకుంటే సీజ్ చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు., రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేశారు.
పోలీసు కళాబృందం వారు పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య,రవాణా శాఖ అధికారి శ్రీకాంత్ చక్రవర్తి ,తూప్రాన్ ఆర్డీవో బావయ్య పాల్గొన్నారు.

# చివరి దశలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

**332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత**

**ధాన్యం కొనుగోలు రైతులకు 725.13 కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 10 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
జిల్లాలో ధాన్యం కొనుగోలు చివరి దశలో ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.
జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే వరకు 88,672 మంది రైతుల నుంచి 3,89,364.120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,68,413 మంది రైతుల బ్యాంకు ఖాతాలో 725.13 కోట్ల రూపాయలు చెల్లింపులు జరిపామన్నారు. ఇప్పటి వరకూ 332 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేశామన్నారు. రైతులు అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# అందోల్ మండలం పలు గ్రామాలలో గ్రామసభలు



**ఆందోల్ ప్రతినిధి జూన్ 10 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అందరికీ నమస్కారం, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు ఆందోల్ మండలంలోని నేరేడుగుంట, అన్నాసాగర్, చింతకుంట, డాకూర్,రోళ్లపహాడ్, తాలేల్మ, యర్రరం గ్రామపంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించడం జరిగింది,,, నేరేడిగుంట గ్రామపంచాయతీలో జరిగిన ప్రత్యేక గ్రామ సభకు మండల ప్రత్యేక అధికారి అలీమ్ గారు,ఎంపీడీవో రాజేష్ కుమార్ గారు, ఎంపీ ఓ రవీందర్ రెడ్డి గారు, పంచాయతీ కార్యదర్శి,గ్రామసర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం సభ్యులు ఇతర అధికారులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# అడ్డుగోలుగా రైతులను దోచుకుంటున్న ఫర్టిలైజర్ షాప్ లపై చర్యలు తీసుకోండి

**ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఎం సురేష్**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 10 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )** జహీరాబాద్ ప్రాంతంలో అడ్డుగోలుగా తమ ఇష్టానుసారంగా ఫర్టిలైజర్ షాప్ యజమాన్యాలు రైతులకు అధిక ధరలకు మందుల అమ్మితూ అధిక ధరలకు విక్రయిస్తూ ప్రభుత్వం నియమించిన ధరలకే ఇవ్వాలని అడిగితే మా దగ్గర మందులు లేవు వెళ్లిపొండి అని బెదిరిస్తున్నారని డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి ఏడి బిక్షపతి గారికి భారత్ కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్టియు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది అనంతరం ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఎం సురేష్ మాట్లాడుతూ రైతులను ఫర్టిలైజర్ షాప్ యజమాన్యాలు రైతులకు తమ ఇష్టానుసారంగా లాభర్జన దేంగా రైతులకు ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా తమ ఇష్టానుసారంగా డబ్బులే లాభార్జనంగా చేసుకొని నాసిరకమైన మందులు ఇస్తూ అధిక ధరలకు యూరియా గానీ ణాూా.జశీఎజాశ్రీవఇ.వాస్తవానికి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ఫర్టిలైజర్ షాపులో స్టాక్ బోర్డు (ర్శీఎఎ ఎశ్మీతీఎ)ఏర్పాటు చేయాలి తప్పనిసరిగా రైతుకు తెలియాలి ఇలా ఏ షాపులో ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించడం లేదు అంతే కాకుండా పురుగుల మందులు విత్తనాలు మొదలగినవి అధిక ధరలకు అమ్ముతూ రైతులకు ఒరిజినల్ బిల్లులు ఇయ్యకుండా తమ ఇష్టానుసారంగా ఫర్టిలైజర్ షాప్ యజమానులు పెట్టుకున్న రేటు కే రైతులు కొనాల్సిన పరిస్థితి వచ్చింది కనుక రైతులపై దయవుంచి తక్షణమే ఫర్టిలైజర్ షాపులపై తనిఖీలు నిర్వహించి రైతులను మోసం చేస్తున్న యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తమరితో మనవి చేయుచున్నాము ఐఎఫ్టియు
డివిజన్ నాయకులుజి నరేందర్. గోపాల్ అనిరుద్. ఆకాష్ తదితరులు పాల్గొన్నారు

# అర్హులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వకుంటే.. పోరాటం తథ్యం!

**జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి**

**హెల్త్ కార్డును ప్రకటించాలి**

**ఈ నెలాఖరులో జిల్లా యూనియన్ మహాసభ**

**టీయూడబ్ల్యూజే(ఐజేయు) తీర్మానం**



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 10 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
సంగారెడ్డి జిల్లా లో మిగిలిన జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే-ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం నాడు సంగారెడ్డిలో యూనియన్ జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కె ఫైజల్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సిద్ధన్న పాటిల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా విభాగం అధ్యక్షుడు అనిల్ కుమార్ ఆందోల్ నియోజకవర్గం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భూమయ్య రాష్ట్ర సోషల్ మీడియా ప్రచార కమిటీ సభ్యులు మునిపల్లి యాదగిరి ఈ సమావేశానికి హాజరయ్యారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యపై, హెల్త్ కార్డుల అంశంపై చర్చించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించాలని తీర్మానించారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా హెల్త్ కార్డును ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డుల జారీలో చాలా ఆలస్యం అవుతుందని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. అయినప్పటికీ తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామనారాయణ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ అహ్మద్ ఆధ్వర్యంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి అనేకసార్లు విన్నవించడం జరిగిందని చెప్పారు.దీని ఫలితంగానే అనేక సవరణలు వచ్చాయని, దానివల్లనే చాలామందికి అక్రిడేషన్ కార్డులు జారీ అయ్యాయని వివరించారు. మిగిలిన వారికి కూడా ఎలాంటి కొర్రీలు వేయకుండా తక్షణమే కార్డు మంజూరు చేయాలని ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. తమ సంఘానికి పోరాటం కొత్త కాదని, జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం గా టీయూడబ్ల్యూజే ఉన్నదని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఎవరు ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమమే తమ సంఘం ధ్యేయమని ఆయన చెప్పారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అన్నారు. ఈ నెలాఖరులో జిల్లా మహాసభను నిర్వహిస్తామని, జిల్లా కమిటీని ఎన్నుకుంటామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే ఫైసల్ తెలిపారు. యూనియన్ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ సూచించారు.
ఇతర ముఖ్య నేతలు అక్రమ్ పటేల్, మసూద్ ఖాన్, శ్రీనాథ్, బాసిత్, అన్వర్ హుస్సేన్, హాజీ, మినాజ్, సిద్ధిక్, విష్ణు వర్ధన్, జోగిపేట భూమన్న, యాదగిరి, అబ్దుల్ మతిన్, విల్సన్, అంజయ్య ,సంగమేశ్
వెంకటేష్ గౌడ్ సిద్దు, రమేష్ గౌడ్, సత్తార్, తదితరులు పాల్గొన్నారు.



# అంగన్‌వాడీల్లో నిర్లక్ష్యం సహించం

**ఐసీడీఎస్ సేవలపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు -కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హెచ్చరిక**

**శ్రీ సత్యసాయి సంక్షేమం,జూన్ 10,(రిపబ్లిక్ న్యూస్):**
అంగన్‌వాడీల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, సమగ్ర శిశు అభివృద్ధి సేవల (ఐసీడీఎస్) అమలులో ఎలాంటి నిర్లక్ష్యం జరిగినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసీడీఎస్ పనితీరు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, పెండింగ్ దరఖాస్తులు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు.

**వివిధ ప్రాజెక్టుల పరిధిలో పురోగతి మెరుగుపరచాలి**
గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని సేవలను వంద శాతం అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 2,824 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఫేషియల్ రికగ్నిషన్ ఈ-కేవైసీ ప్రక్రియ 86.45 శాతం మాత్రమే నమోదైందని, మిగిలిన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా గుడిబండ, పుట్టపర్తి, హిందూపురం ప్రాజెక్టుల పరిధిలో పురోగతిని మరింత మెరుగుపరచాలన్నారు.ప్రధానమంత్రి మాతృ వందన యోజన కింద జిల్లా వ్యాప్తంగా 754 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, ధర్మవరం, ఓబులదేవరచెరువు ప్రాజెక్టుల్లో అధికంగా ఉన్న పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

**సీడీపీఓలు స్వయంగా సమస్యలను పరిష్కరించాలి**
అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇంకా 137 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడం, 411 కేంద్రాల్లో మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమని పేర్కొంటూ వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.మే నెల టేక్ హోమ్ రేషన్ పంపిణీ, ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ అమలును సమీక్షించిన కలెక్టర్, మడకశిర ప్రాజెక్టు పరిధిలో పంపిణీ శాతం తక్కువగా ఉండడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి ప్రతికూల స్పందన వచ్చిన అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓలు స్వయంగా సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.చిన్నారుల ఆరోగ్య సూచికలను మెరుగుపరచడంలో క్షేత్రస్థాయి సిబ్బంది కీలక పాత్ర పోషించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమీల, జిల్లా అధికారులు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



**ఒక సీడీపీఓ కు, ఐదు మంది సూపర్ వైజర్లకు మెమో జారీకి కలెక్టర్ ఆదేశం**
శ్రీ సత్యసాయి జిల్లాలోని ఐసీడీఎస్ శాఖలో పని చేసే ఒక సీడీపీఓకు ఛార్జ్ మెమో జారీ చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించినట్లు సమాచారం. మరో ఐదుగురు సూపర్ వైజర్లకూ మెమో జారీ చేయాలని ఆయన ఆదేశించారు. విధి నిర్వహణలో విపరీతమైన నిర్లక్ష్యం వహించడమే కాకుండా, లక్ష్య సాధనలో పూర్తి వెనుకబడి ఉండడంతో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సీరియస్ గా తీసుకున్నారు. దీని ప్రభావం జిల్లా మొత్తమ్మీద .. రాష్ట్ర స్థాయిలో జిల్లా వెనుకబడిపోయిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పదేపదే చెబుతున్న పట్టించుకోకపోవడం, పని తీరు మెరుగుపరుచుకోవడం వంటి అంశాలను సీరియస్ గా తీసుకున్న కలెక్టర్ ఈ మేరకు కఠినమైన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం అందింది. అంశం ఇపుడు ఆ జిల్లాలో సంచలనంగా మారింది.




# నా సామి వైద్యం .. వ్యాపారం



## పుట్టగొడుగుల్లా ప్రైవేట్ ఆసుపత్రులు
## అర్హతలు లేని వారితో రోగులకు చికిత్స
## ఇష్టారాజ్యంగా బిల్లులు వసూళ్ల పర్వం
## ఆర్ఎంపీలు కమిషన్ల కక్కుర్తితో రోగులు రెఫర్
## అనంతలో ఆసుపత్రుల పర్యవేక్షణ శూన్యం
## నిద్ర మత్తు వదలని ఉన్నతధికారులు




**అనంతపురం క్రైమ్ బ్యూరో, జూన్ 10(రిపబ్లిక్ న్యూస్):** వైద్యం వ్యాపారంగా మారి నా సామి కోట్ల రూపాయలను కొల్లగొడుతున్న కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యం.

ఈ సందర్భంగా అనంతపురం జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రులకు అనుమతులు ఏ విధంగా ఇస్తున్నారు, ఎవరు ఇస్తున్నారు. వీటివల్ల ఈ అంశం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కార్పొరేట్ ఆసుపత్రులు వైద్యం పేరుతో ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారు. దీంతో కోట్లాది రూపాయల వైద్యం వ్యాపారం జోరుగా సాగుతుందని చెప్పవచ్చు. పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. దీనివల్ల రోగుల వైద్యానికి వీరి బంధువులు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అందులో భాగంగా వైద్య వృత్తిలో అరకొరగా వైద్యం అందజేసే వైద్యులు కూడా లేకపోలేదు. ఇంకొందరు నటనకు జీవం పోస్తూ ... కనీస డాక్టర్ అర్హత లేకున్నా విధులు నిర్వహిస్తూ .. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. జిల్లాలో ఇంత తంతు జరుగుతున్నప్పటికీ కూడా ఏ ఒక్క ఉన్నత అధికారి కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. అంటే వైద్య రంగంలో ఏ మేరకు వైద్యులు మాఫియాగా ఏర్పడి కోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారో అక్షర సత్యమే కదా ...

### ఎలాంటి అర్హతలు లేకపోయినా ఆస్పత్రులు ఏర్పాటు

అన్ని రంగాలతో పాటు వైద్యం కూడా వ్యాపారంగా మారింది. ఈ క్రమంలో ప్రజలకు ఎంతో ముఖ్యమైన వైద్యరంగంలోని కొందరు నిర్వాహకులు, వైద్యులు కాసుల కక్కుర్తితో పక్కదారులు తొక్కుతున్నారు. సంపాధనే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఎలాంటి అర్హతలు లేకపోయినా ఆస్పత్రులు ఏర్పాటు చేయడం పరిపాటిగా మారింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఫైనాన్స్ నిర్వాహకు లు కూడా మల్టీ స్పెషాలిటీ, 24 గంటల వైద్య సేవల పేరుతో ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో తెల్లారేసరికల్లా రకరకాల బోర్డులతో ఆస్పత్రులు వెలుస్తున్నాయంటే అతిశయోక్తి కాదు.

### డి ఎం హెచ్ ఓ కు తెలియకుండానే ఇవన్నీ జరుగుతున్నాయా

రోగులకు సరైన వైద్యం అందించడంలో కార్పొరేట్ ఆసుపత్రులు రోగుల బంధువుల రక్తాన్ని జలగల్లా పీల్చుకు తాగేస్తున్నారు. ఈ రకంగా కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు కోట్ల రూపాయలను దోచుకుంటున్నారు. అందులో భాగంగా ప్రైవేట్ ఆసుపత్రులకు మధ్యవర్తులుగా ఎవరు వ్యవహరిస్తున్నారు.ఏ ప్రైవేట్ ఆసుపత్రులలో అర్హత లేని డాక్టర్లు విధులు నిర్వహిస్తున్నారో త్వరలో వారి పేర్లు, పర్మిషన్ లేని ఆసుపత్రుల లిస్ట్ , మధ్యవర్తిగా ఆసుపత్రులకు వ్యవహరించి వ్యక్తులను వారి పేర్లతో సహా బయట పెట్టబోతున్నాం.ఒక్కొక్క ఆసుపత్రి కి ఒక రేటు అంటూ మల్టీ స్పెషాలిటీ ఒకరేటు సర్జన్ కోపరేటివ్ ఎండికి ఒక రేటు అంటూ మధ్యవర్తులు వ్యవహరిస్తున్నా కూడా

డి ఎం హెచ్ ఓ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. డి ఎం హెచ్ ఓ కు తెలియకుండానే ఇవన్నీ జరుగుతున్నాయా అంటే నమ్మడానికి ఎవరూ లేరనే చెప్పవచ్చు.డిఎంహెచ్ఓ కార్యాలయంలో సిబ్బంది ఎవరి చేతివాటం వాళ్ళు ప్రదర్శిస్తున్నారు.ఆ సిబ్బందితోపాటు ఎవరెవరున్నారో వారి పేర్లు రిపబ్లిక్ దినపత్రిక మీ ముందుకు తీసుకురాబోతుంది. ఏ ఏ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఏం జరుగుతున్నాయో లిఖితపూర్వకంగా కలెక్టర్ కూడా ఇచ్చాం.ఆరోగ్యశ్రీ ని ఒక ఆసుపత్రిలో చేర్పిస్తూ మరో ఆసుపత్రిలో బిల్లులు పెట్టుకుంటూ ప్రైవేట్ యాజమాన్యాలు కోట్లు రూపాయలను కూడగట్టుకుంటున్నారు.

### అనుమతులు లేకుండా నూతనంగా ఆసుపత్రులు నిర్మాణం

కొత్తగా నిర్మిస్తున్న అనేక ఆసుపత్రులు టౌన్ ప్లానింగ్ అనుమతులు, అగ్నిమాపక శాఖ క్లియరెన్స్, పార్కింగ్ సదుపాయాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పూర్తి చేయకుండానే కార్యకలాపాలు ప్రారంభిస్తున్నారు.టౌన్ ప్లానింగ్ అనుమతులు లేకుండా నూతనంగా అనేక ఆసుపత్రులను నిర్మిస్తున్నారు. ఆసుపత్రుల అనుమతుల ప్రక్రియలో కొందరు మధ్యవర్తులు కీలకంగా వ్యవహరిస్తున్నారని చెప్పకనే చెప్పవచ్చు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఫైళ్ళ దగ్గర నుంచి ఆసుపత్రుల అనుమతుల వరకు అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. అయినా కూడా అధికారులు ఇష్ట రాజ్యాంగా వ్యవహరిస్తూనే ఉన్నారు. ఇంత తంతు జరుగుతున్నప్పటికీ కూడా అధికారులు నిద్ర మత్తు వదలడం లేదు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతధికారులే చేతులెత్తేయడం ఎంతవరకు సమంజసం.

### డిస్పోజల్ వేస్టేజ్ ను డంప్ ఎక్కడ

ఆసుపత్రుల్లో ఉత్పత్తి అవుతున్న బయోమెడికల్ వ్యర్థాలు ఎక్కడ డంప్ చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి పట్టణంలో నెలకొంది.రోగుల రక్తం, ఆపరేషన్ వ్యర్థాలు, ప్రమాదకర వైద్య చెత్తను నిబంధనల ప్రకారం డంప్ చేయాల్సి ఉన్నా... ఇతర ప్రాంతాల్లో పారవేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్కానింగ్ సెంటర్లలో ఏమీ లేకున్నా ఏదో ఒకటి ఉన్నట్లు కల్పిస్తూ వేలకు వేలు వసూలు చేస్తున్నారు.ఆపరేషన్ చేయాలంటూ వేళల్లో డబ్బులు వసూలు చేసి రోగులు అప్పులు పాలు అవడానికి ప్రైవేట్ ఆసుపత్రుల యజమాన్యమే కారణం.ప్రైవేట్ ఆస్పత్రుల స్కానింగ్ సెంటర్లు రోగులను రక్తం పీలుస్తూ పిప్పి చేస్తున్నారు. ప్రైవేటు యాజమాన్యాలు ఏజెన్సీలు స్కానింగ్ సెంటర్లు దళారులు కూడా ఏకమై ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

### రోగుల ప్రాణాలతో చెలగాటం

ఆర్ఎంపీలు చిన్న జ్వరం వచ్చిందంటే స్కానింగ్ కు వెళ్లాలని ప్రవేట్ ఆసుపత్రులకు వెళ్లాలంటూవారే సూచించడం గమనార్హం. దీంతో ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు ఆర్ఎంపీలకు కాసులు వర్షం కురిపిస్తున్నారు.చిన్న జ్వరం వచ్చినా స్కానింగ్‌లు చేయించుకోవాలని, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాలని కొందరు ఆర్ఎంపీలు రోగులను ప్రోత్సహిస్తున్నారు. ఎంతమంది రోగులను రిఫర్ చేస్తే అంత కమిషన్ వస్తుందనే కక్కుర్తితో ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. ఆర్ఎంపీల మాటలు విన్న రోగులు వీరిపై నమ్మకంతో కార్పోరేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రాణాలను అరిచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి రోగులకు ఏర్పడిందని చెప్పవచ్చు. అందులో భాగంగా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు కొందరు అధికారులు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వెళ్ళు వెత్తుతున్నాయి.

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.జిల్లాలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు ప్రభుత్వ అధికారులు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా కూడా అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు.ప్రవేట్ ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన ఉన్నత అధికారులు నిద్ర మత్తు వదలడం లేదు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు ప్రభుత్వ అధికారులు రెడ్ కార్పెట్ వేస్తున్నారు.

### అగ్నిమాపక సిబ్బంది మంటలార్పేందుకు అవకాశం ఉందా

జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లో చాలా వాటిలో రోగుల భద్రతకు ఎలాంటి గ్యారెంటీ లేదు. ఆసుపత్రుల్లో అగ్నిమాపకశాఖ నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలి. అయితే ఫైర్ ఫైటింగ్ కిట్లు ఏర్పాటు చేయడంతోనే సరిపెడుతున్నారు. ప్రమాదం జరిగితే అందులో ఏ ఒక్క పరికరమూ పని చేస్తుందో...లేదో తెలియని పరిస్థితులు ఉన్నాయి. సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేస్తుండడంతో నిబంధనలను తుంగలో తొక్కుతున్న వ్యాపారులు మల్టీ స్పెషాలిటీ పేర్లతో ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నారు. ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే రోగులను కాపాడేందుకు అవసరమైన ఏర్పాట్లు ఉండాలి. ఆస్పత్రికి రెండు వైపులా మెట్లు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఒక ద్వారం మూసు కుపోతే మరో ద్వారం గుండా రోగులను బయటకు తీసుకువచ్చే వెసులుబాటు ఉంటుంది. అలాగే భవనం చుట్టూ ఫైర్ ఇంజన్ తిరిగేందుకు ఖాళీ స్థలం ఉండాలి. మంటలు చెలరేగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది చుట్టూ తిరుగుతూ మంటలనార్పేందుకు అవకాశం ఉంటుంది. కానీ పట్టణంలో సరైన స్థలం లేక పోవడంతో వీధులలో కొందరు ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నారు. కనీసం ఆటో కూడా వెళ్లలేని స్థితిలో అనేక ఆసుపత్రులు ఉన్నాయి. వాటిలో ఊహించని ప్రమాదమేదైనా జరిగితే ఊహించని ప్రాణ నష్టం జరుగుతుందనే చెప్పవచ్చు. ఆసుపత్రుల గదుల్లో నుంచి రోగులను బయటకు తెచ్చేందుకు అవకాశం లేని భవనాలు పట్టణంలో అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేని ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు చేపట్టాల్సి ఉంది. జిల్లా యంత్రాంగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

---

# గత ప్రభుత్వ ఏపీఎండిసి సంస్థలో

# ఆ ముగ్గురిదే హవా.






**రైల్వే కోడూరు జూన్ 10 రిపబ్లిక్ న్యూస్.** గత ప్రభుత్వ హయాంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఏపీ ఎంబీసీ సంస్థలో ఆ ముగ్గురు దే హవా.. వారు చెప్పిందే వేదం అన్నట్లుగా సాగింది. మంగంపేటలో అగసాట్లు బెంగుళూరులో ప్లాట్లు, అనే పదాలకు నిలువెత్తు నిదర్శనంగా మంగంపేట ముగ్గురాయి అక్రమార్జనతో ఆ ముగ్గురు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కోట్ల రూపాయలకు పడగలెత్తి అధిక సంపన్నులుగా ఎదిగారని విమర్శలు గుప్పిస్తున్నాయి మార తీ తీ కంపెనీలతో ముగ్గురాయి వ్యా పార సామ్రాజ్యాన్ని విస్తరించి సీసీ కెమెరాలు కళు ్ళగప్పి కొందరు అధికారులు మాయాజాలంతో ముగ్గురాయిని పక్కదారి పట్టించి. కోట్ల రూపాయలు విలువ చేసే ముగ్గురాయిని వివిధ కంపెనీలకు సరఫరా చేసి ఓఎన్జిసి అనుసంధానమైన కంపెనీలకు ఎగుమతి చేసి కోట్లాది రూపాయలు అక్రమార్జన వెనకేసుకున్నట్లు విమర్శలు లేకపోలేదు అంతేకాకుండా బ్లాస్టింగ్. మరియు అకౌంట్.. మైనింగ్ వివిధ శాఖలతో పనిచేస్తూ అధికారులకు పైరవీ రులుగా మారి వారు చెప్పిందే వేదంగా ఎండికే సహా క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు నెరవేసి వీళ్లు పనులు చక్క పెట్టుకున్నారని ఆరోపణలు మెండుగా వినపడుతున్నాయి. కొంతమంది చిన్న వ్యాపారులు మిల్లులు మూసినప్పటికీ ఎన్నో కష్టాల మధ్య జీవితాన్ని నాశనం చేసుకొని జీవిస్తూ ఉంటే కొంతమంది మాత్రమే బినామీ మిల్లులతో ఎటువంటి హక్కులు లేకుండా ముగ్గురాయి పౌడర్ రాకుండా ముడి ఖనిజాన్ని ఎగుమతి చేసి కోట్ల రూపాయలు వెనకేసుకున్నట్లు తెలుస్తోంది వీటి పైన సంబంధిత ఉన్నత అధికారులు సమగ్ర విచారణ చేపట్టి గత ప్రభుత్వంలో పక్కదారి పట్టిన ముగ్గురాయి రికవరీ చేయించాలని అటు బిజెపి నాయకులు కార్మిక నాయకులు కూటమి నాయకులు ప్రజలు కోరుతున్నారు

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com